Follow: @ANNTELUGU

19-06-2026

# మహా పత్రిక

ANN తెలుగు

శుక్రవారం, హైదరాబాద్  సంపుటి- 23  సంచిక- 168  పేజీలు-08  వెల-రూ.1

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI  REGISTERED NUMBER: APTEL/2003/09316  WWW.EPAPER.MAHAADAILY.COM










04

టాప్ న్యూస్

## కర్నాటకలో డీకే షాక్

- బిజెపి, జెడిఎస్ లకు చెందిన 11మంది ఎమ్మెల్యేల క్రాస్ ఓటింగ్
- ఐదవ ఎమ్మెల్సీ కూడా గెలిచిన కాంగ్రెస్
- జార్ఖండ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు షాక్
- క్రాస్ ఓటింగ్ తో గెలిచే సీటు గాయబ్



02

## రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

- ఎస్‌బీఐ పిటిషన్ ను విచారించిన కోర్టు
- టీజీఐఐసీకి, గౌర వెంచర్స్ కు నోటీసులు



02

## పవన్ కల్యాణ్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి.

- కరీంనగర్ రౌండ్‌టేబుల్ సమావేశంలో కవిత ధ్వజం
- తెలంగాణ ప్రజలను అవమానించారని ఆరోపణ



02



## ఏపీ మాజీ మంత్రి కారుమూరి కుమారుడు సునీల్ అరెస్ట్

**హైదరాబాద్, మహా :** ఏపీలో వైకాపా హయాంలో జరిగిన మద్యం రవాణా కుంభకోణం కేసులో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు కుమారుడు సునీల్ ను ఈడీ అరెస్ట్ చేసింది. హైదరాబాద్‌లో ఆయన్ను అధికారులు అరెస్ట్ చేసి ఈడీ కార్యాలయానికి తరలించారు. అనంతరం నాంపల్లిలోని కోర్టులో హాజరుపరిచారు. కారుమూరి నివాసంలో ఇటీవల ఈడీ అధికారులు తనిఖీలు నిర్వహించి వివిధ పత్రాలను పరిశీలించారు. ఇదే కేసులో ఇప్పటికే కీలక సూత్రధారి రాజ్ కెసిరెడ్డి, ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవరెడ్డిని ఈడీ అరెస్ట్ చేసింది. ఇపుడు కారుమూరి సునీల్‌ను అధికారులు అరెస్ట్ చేశారు.

02



ఎవడు ఎండ్రిన్ తాగి సచ్చినా..

# భారత్ ఫ్యూచర్ సిటీ కడతా

## మూసీ ప్రాజెక్టు పూర్తిచేసి తీరుతా
## ఫ్యూచర్ లేనోళ్ళే ఫ్యూచర్ సిటీ రద్దంటున్నరు
## చెరువులు కుంటలు ఆక్రమిస్తే తోలుతీస్తా



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, మహా :** ఎవడైనా సరే చెరువులు, కుంటలు ఆక్రమిస్తే తోలు తీస్తా. ఎవరు అడ్డం పడిదొర్లినా, ఎండ్రిన్ తాగి సచ్చినా సరే.. భారత్ ఫ్యూచర్ సిటీ కడుతా.. అంతర్జాతీయ కంపెనీలు తీసుకొస్తా అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చిచెప్పారు. ఫ్యూచర్ లేనోడల్లా ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తానంటున్నాడు.. నువ్వు మళ్ళీ సిద్ధిపేటలో గెలిస్తే కదా అంటూ హరీష్ రావుపై సీఎం ఫైర్ అయ్యారు. దేశంలోని ఢిల్లీ, ముంబయ్, బెంగుళూరు లాంటి మహానగరాలు ఎదుర్కొంటున్న కాలుష్యం, వరదల వంటి దుస్థితి హైదరాబాద్ నగరానికి రాకూడదన్న సంకల్పంతో పని చేస్తున్నామని చెప్పారు. గుర్రంగూడ ఎకో పార్క్‌లో వన మహోత్సవం కార్యక్రమాన్ని సీఎం ప్రారంభించారు. హరిత నిధి ద్వారా నాగలింగం మొక్కను ముఖ్యమంత్రి నాటారు. రోబోటిక్ ఏనుగును ఆవిష్కరించారు. ఈ క్రమంలో గుర్రంగూడ

మిగతా 2వ పేజీలో

# ముగిసిన యుద్ధం

డొనాల్డ్ ట్రంప్, పెజెష్కియాన్ సంతకాలు
అమెరికా-ఇరాన్ ఒప్పందంలో 14 అంశాలు
స్విట్జర్లాండ్‌లో తొలి చర్చల సమావేశం

02





తెలంగాణా రైతాంగానికి

# తీపి కబురు

## జూన్ 30నుండి రైతు భరోసా చెల్లింపులు

03

- ఏడు సన్నరకాల వరి వంగడాలకు బోనస్ కొనసాగింపు
- మధిరలో భారీ రైతు సమ్మేళనం నిర్వహించాలని మంత్రివర్గ నిర్ణయం
- ఎరువుల కేటాయింపులు, పంటల కొనుగోళ్లపై కేంద్రంపై ఒత్తిడి
- హైదరాబాద్ మెట్రో విస్తరణకు అనుమతులు కోరనున్న రాష్ట్ర ప్రభుత్వం



ఆర్టీసీ గుర్తింపు సంఘాల

## ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

మంత్రి పొన్నం సమీక్ష

03

సాయికృష్ణ లాకప్ డెత్ ఘటనపై

## సీబీఐ విచారణకు వైఎస్ జగన్ డిమాండ్

బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సీఎం



02

## రౌడీషీటర్ సాయికృష్ణ మిస్సింగ్ కేసులో కీలక మలుపు

- కృష్ణలంక పీఎస్ సీసీటీవీ ఫుటేజ్ భద్రపరచాలంటూ తల్లి పిటిషన్.
- నేడు తీర్పు వెలువరించనున్న విజయవాడ రెండో ఏజేఎం కోర్టు.

02



సచివాలయం ముట్టడికి

## జర్నలిస్టుల యత్నం

అడ్డుకున్న పోలీసులు గన్ పార్కు వద్ద అరెస్టులు

02

# అమెరికాలో రియల్ ఛేంజ్

- అమెరికా మార్కెట్‌లో స్థిరంగా ఇళ్ల ధరలు
- అధిక స్థాయిలో వడ్డీ రేట్లు
- డల్లాస్, హ్యూస్టన్, నాష్‌విల్లే వంటి నగరాల్లో వృద్ధి అవకాశాలు
- అన్ని చోట్లా కాకుండా కొన్ని నగరాల్లోనే పెరుగుతున్న డిమాండ్
- పెరిగిన ఇళ్ల లభ్యతతో కొనుగోలుదారులకు ఎక్కువ ఆప్షన్లు

02

కొత్తగూడెం బీఆర్ఎస్

## పార్టీలో కొట్లాట

- వనమా, వద్దిరాజు వర్గాల మధ్య ఫైటింగ్
- మా నియోజకవర్గంలో నీ పెత్తనం ఏంటి తక్కెలపల్లి అంటూ కార్యకర్తల ఫైర్

02




# అమెరికాలో రియల్ ఛేంజ్



**మహా :** అమెరికా రియల్ ఎస్టేట్ మార్కెట్ 2026 మిడిల్ కు వచ్చేసరికి తన స్వరూపం పూర్తిగా మార్చుకున్నట్లు కనబడుతోంది. కరోనా తర్వాత ఒకప్పుడు భారీ లాభాలనిచ్చిన ఈ రంగం ఇప్పుడు మందగమనంలో పయనిస్తోంది. అధిక వడ్డీ రేట్లు, దాదాపు నిలకడగా ఉన్న ధరల కారణంగా ప్రవాస భారతీయులు తమ పెట్టుబడి వ్యూహాలను మార్చుకుంటున్నారు. ఆస్తుల విలువ పెరుగుదలపై కాకుండా, అద్దెల రూపంలో స్థిరమైన ఆదాయం ఇచ్చే వాటిపైనే దృష్టి సారిస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ సరళిని పరిశీలిస్తే, ఇళ్ల ధరలు కుప్పకూలకపోయినా, పెరుగుదల దాదాపు ఆగిపోయింది. జేపీ మోర్గాన్ నివేదిక ప్రకారం, ఈ ఏడాది యూఎస్‌లో ఇళ్ల ధరల వృద్ధి సుమారు 0%గా ఉండొచ్చని అంచనా. అదే సమయంలో, అమ్మకాలు నెమ్మదిగా పుంజుకోవచ్చని తెలుస్తోంది. రియల్టర్.కామ్ నివేదిక ప్రకారం, ఫిబ్రవరి 2026 నాటికి విక్రయానికి అందుబాటులో ఉన్న ఇళ్ల సంఖ్య (ఇన్వెంటరీ) పెరిగింది. దీంతో కొనుగోలుదారులకు ఎక్కువ ఆప్షన్లు దొరుకుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఇళ్ల సగటు ధరలు 2.4% తగ్గాయి. గత 18 వారాలుగా ధరలు నిలకడగా ఉండటం లేదా తగ్గడం గమనార్హం. ఎన్నారై ఇన్వెస్టర్లకు అధిక వడ్డీ రేట్లు ప్రధాన సవాలుగా మారాయి. 30 ఏళ్ల ఫిక్స్‌డ్ మార్ట్గేజ్ వడ్డీ రేటు సగటున 6.01% వద్ద కొనసాగుతోంది. ఈ ఏడాది ఇది 6% నుంచి 6.4% మధ్య ఉండవచ్చని అంచనాలున్నాయి. దీనివల్ల నెలవారీ వాయిదాల భారం పెరిగి, అప్పుతో పెట్టుబడులు పెట్టడం కష్టమవుతోంది. దీంతో, కొన్న కొద్ది కాలానికే ఆస్తి విలువ పెరిగిపోతుందనే అంచనాలతో కాకుండా, నెలనెలా అద్దె రూపంలో స్థిరమైన ఆదాయం వచ్చే ఆస్తులకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం అమెరికాలో రియల్ ఎస్టేట్ మార్కెట్ దేశవ్యాప్తంగా ఒకేలా లేదు. ప్రాంతాన్ని, రంగాన్ని బట్టి పనితీరు మారుతోంది. సీబీఆర్ఈ నివేదిక ప్రకారం, 2026లో యూఎస్ రియల్ ఎస్టేట్ పెట్టుబడులు 16% పెరిగి 562 బిలియన్ డాలర్లకు చేరుకోవచ్చు. అయితే ఈ వృద్ధి డేటా సెంటర్లు, ఇండస్ట్రియల్ ఆస్తులు, మల్టీ ఫ్యామిలీ హౌసింగ్ వంటి రంగాలలోనే ఎక్కువగా కనిపిస్తోంది. డల్లాస్/ఫోర్ట్ వర్త్, హ్యూస్టన్, నాష్‌విల్లే వంటి నగరాల్లో వృద్ధి అవకాశాలు బలంగా ఉన్నాయని పీడబ్ల్యూసీ నివేదిక సూచిస్తోంది. అమెరికా రియల్ ఎస్టేట్ మార్కెట్ ఇప్పుడు ఊహాగానాలతో కాకుండా వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పెట్టుబడులు పెట్టాల్సిన దశకు చేరుకుంది. సరైన ప్రాంతాన్ని, స్థిరమైన అద్దె డిమాండ్ ఉన్న ఆస్తిని ఆచితూచి ఎంపిక చేసుకోవడం ముఖ్యం.

# ముగిసిన యుద్ధం

**మహా:** పశ్చిమాసియాలో ఉద్రిక్తలకు తెరపడింది. అమెరికా ఇరాన్ మధ్య యుద్ధానికి ముగింపు పలికేందుకు 14అంశాల ఆధారంగా ఇరు దేశాలు ఒప్పందం చేసుకున్నాయి. గురువారం ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ వర్చువల్ పద్ధతిలో 14 అంశాల అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్‌తో భేటీ కోసం పారిస్ వెళ్లిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, అక్కడి నుంచే ఈ చారిత్రాత్మక పత్రంపై స్వయంగా సంతకం చేశారు. ఇటు ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ కూడా టెహ్రాన్ నుంచి దీనికి ఆమోదం తెలపడంతో ఈ ఒప్పందం తక్షణమే అమలులోకి వచ్చింది. అయితే, ఈ చారిత్రాత్మక ఒప్పందం అంత సులభంగా సాధ్యపడలేదు. కొన్ని నెలలుగా ఒమన్ తో ఇతర దేశాలు నేతృత్వంలో తెరవెనుక తీవ్రమైన దౌత్య సంప్రదింపులు జరిగాయి. ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి ఈ విషయాన్ని అధికారికంగా ధృవీకరించారు. పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థను దెబ్బతీస్తున్న తరుణంలో, ఇరు దేశాలు పట్టువిడుపులకు వెళ్లకుండా ఒప్పందానికి ముందుకు వచ్చాయి. శుక్రవారం తొలి చర్చల సమావేశం కూడా జరగనుంది

### ఒప్పందంలోని కీలక అంశాలు ఇవే

- అమెరికా ఇరాన్ మధ్య ఒప్పందంలో ఇరు దేశాలు అంతర్జాతీయ శాంతిని దృష్టిలో ఉంచుకుని ఈ ఒప్పందానికి అంగీకరించాయి. ఇందులోని కొన్ని కీలకమైన అంశాలు ఇలా ఉన్నాయి.
- లెబనాన్ సరిహద్దులతో సహా పశ్చిమాసియాలోని అన్ని ప్రాంతాలలో ఇరు దేశాలకు సంబంధించిన ప్రత్యక్ష, పరోక్ష సైనిక చర్యలు, దాడులను తక్షణమే నిలిపివేయాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా ఇజ్రాయెల్, హిజ్బుల్లా మధ్య కూడా ఒక సంధి జరగనుంది.
- కొంతకాలంగా ఉద్రిక్తతలకు కేంద్రంగా మారి, అంతర్జాతీయ వాణిజ్యానికి అడ్డుకట్టగా మారిన హర్మూజ్ జలసంధి ద్వారా వాణిజ్య నౌకల రాకపోకలను పునరుద్ధరించనున్నారు. ప్రారంభంలో 60 రోజుల పాటు ఎలాంటి అదనపు రుసుము లేకుండా అంతర్జాతీయ నౌకల సురక్షిత ప్రయాణాన్ని ఇరాన్ కల్పించనుంది.
- ఇరాన్ ఆర్థిక వనరులను దెబ్బతీయడానికి ఆ దేశ సరిహద్దుల వద్ద అమెరికా విధించిన నౌకాదళ దిగ్బంధాన్ని అమెరికా తక్షణమే ఉపసంహరించుకోనుంది.
- యుద్ధాలు, ఆంక్షల కారణంగా నష్టపోయిన ఇరాన్‌లో పునర్నిర్మాణ పనులు, ఆర్థిక అభివృద్ధి కోసం అమెరికా మద్దతుతో దాదాపు 300 బిలియన్ డాలర్ల (సుమారు ₹25 లక్షల కోట్లు) భారీ ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. దీనితో పాటు వివిధ దేశాల్లో స్తంభింపజేసిన ఇరాన్ ఆస్తుల విడుదల, ఇరాన్ చమురు ఎగుమతులపై అమెరికా ట్రెజరీ మినహాయింపులు ఇవ్వనుంది.
- తాము ఎప్పటికీ అణు ఆయుధాలను తయారు చేయబోమని ఇరాన్ ఈ ఒప్పందంలో ప్రపంచ దేశాలకు స్పష్టమైన హామీ ఇచ్చింది. అయితే, ఇరాన్ వద్ద ఇప్పటికే ఉన్న సుసంపన్నమైన యురేనియం నిల్వల భవిష్యత్తును ఎలా నిర్ణయించాలనే దానిపై అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ పర్యవేక్షణలో రాబోయే చర్చల్లో ఒక నిర్ణయానికి రానున్నారు.

**ఇద్దరూ తగ్గి..**

'ఈ ఒప్పందం ద్వారా హర్మూజ్ జలసంధిని వెంటనే తెరవడంతో పాటు, తమ వద్ద ఉన్న అణు వ్యర్థాలను నాశనం చేయడానికి ఇరాన్‌ను ఒప్పించగలిగాము. ఇరాన్ తన పద్ధతిని మార్చుకుని అంతర్జాతీయ నిబంధనలకు కట్టుబడి మంచి ప్రవర్తనను కనబరిస్తే, మేము కూడా ఆంక్షలను క్రమంగా ఎత్తివేస్తూ ఆ దేశ ఆర్థిక వృద్ధికి తోడ్పడతాం. ఒకవేళ వారు నిబంధనలు ఉల్లంఘిస్తే ఆంక్షలు మళ్లీ కఠినతరం అవుతాయి' అని అమెరికా అధికారి స్పష్టం చేశారు. ఈ తాత్కాలిక అవగాహన ఒప్పందాన్ని పూర్తి స్థాయి శాశ్వత ఒప్పందంగా మార్చడానికి ఇరు దేశాలకు 60 రోజుల గడువును విధించారు. అవసరమైతే ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో ఈ గడువును మరింత పొడిగించుకునే అవకాశం ఉంది. అమెరికా ఇరాన్ మధ్య ఒప్పందం అమల్లోకి రాగానే ప్రపంచ వ్యాప్తంగా చమురు ధరలు స్థిరపడటం ప్రారంభమైంది.

**నేడు తొలి చర్చల సమావేశం**

అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరగా, ఇప్పుడు దాన్ని అమలు చేసేందుకు ఇరు దేశాలు సిద్ధమవుతున్నాయి. ఈ మేరకు తొలి దశ చర్చలు స్విట్జర్లాండ్‌లో జరగనున్నాయి. శుక్రవారం స్విట్జర్లాండ్‌లోని బుర్గెన్‌స్టాక్ పర్వత ప్రాంత రిసార్ట్‌లో అమెరికా, ఇరాన్ ప్రతినిధులు సమావేశం కానున్నట్లు స్విస్ ప్రభుత్వం వెల్లడించింది. అందుకు గాను ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపింది. స్విస్ విదేశాంగ శాఖ తెలిపిన వివరాల ప్రకారం, అమెరికా, ఇరాన్‌తో పాటు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్న పాకిస్థాన్, ఖతార్ ప్రతినిధులు కూడా ఆ సమావేశంలో పాల్గొననున్నారు. ఒప్పందం అమలుకు సంబంధించిన ప్రాథమిక అంశాలపై చర్చలు జరగనున్నాయని పేర్కొంది.

# పవన్ కల్యాణ్‌పై దేశద్రోహం కేసు నమోదు చేయాలి.

**కరీంనగర్ రౌండ్‌టేబుల్ సమావేశంలో కవిత ధ్వజం**

**కరీంనగర్, మహా:** తెలంగాణ ప్రజలను ఉగ్రవాదులు, వేర్పాటువాదులతో పోల్చిన సినీ నటుడు పవన్ కల్యాణ్‌పై తక్షణమే దేశద్రోహం కేసు నమోదు చేయాలని కవిత డిమాండ్ చేశారు. కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ ఉద్యమకారుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె ప్రారంభోపన్యాసం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటినుంచి తెలంగాణ ఆనవాళ్లను, భావజాలాన్ని పక్కనపెడుతూ పొరుగు రాష్ట్ర నాయకుల పెత్తనానికి మళ్లీ బాటలు వేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తోందని కవిత ఆరోపించారు. రాష్ట్ర చిహ్నంలో ఉన్న కాకతీయుల కళాతోరణాన్ని రాచరిక పోకడ అంటూ తొలగించారని, చార్మినార్, పూర్ణకుంభం తీసేసే ప్రయత్నం చేసి వ్యతిరేకత రావడంతో వెనక్కి తగ్గారని విమర్శించారు. గెజిట్ నోటిఫికేషన్ లేదన్న సాకుతో తెలంగాణ తల్లి విగ్రహాన్ని మార్చి, కొత్త విగ్రహం చేతిలో బతుకమ్మ లేకుండా చేసి తెలంగాణను అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఎలాంటి చర్చ లేకుండానే విగ్రహాన్ని మార్చేశారని, గూగుల్‌లోనూ ఉద్యమ కాలం నాటి పాత విగ్రహం కనిపించకుండా చేశారని దుయ్యబట్టారు. తెలంగాణ కళాకారులకు అడ్డాగా ఉండాల్సిన రవీంద్రభారతిలో సినీ నేపథ్య గాయకుడు బాలసుబ్రహ్మణ్యం విగ్రహం పెట్టడం, గద్దరన్న పేరుతో జానపద అకాడమీకి బదులు సినిమా అవార్డులు ఇవ్వడం ఆంధ్రా పెత్తనానికి నిదర్శనమన్నారు. సచివాలయం ముందు తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాల్సిన స్థలంలో రాజీవ్ గాంధీ విగ్రహం పెట్టారని, జయశంకర్ సార్, మహాత్మా పూలే విగ్రహాలను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో అభివృద్ధి పేరుతో 2009లో ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని తొలగించి, ఉద్యమ వాదానికి అడ్డాగా ఉన్న ఆ ప్రాంతాన్ని అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ఎవడు ఎండ్రిన్ తాగి సచ్చినా.. భారత్ ఫ్యూచర్ సిటీ కడతా

( మొదటి పేజీ తరువాయి )



ఎకో పార్క్ నమూనాను అటవీ అధికారులు.. సీఎంకి వివరించారు. ఎకో పార్క్‌లో రూ.35.50 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గుర్రంగూడ రిజర్వ్ ఫారెస్ట్‌లో రూ.17.84 కోట్లతో అభివృద్ధి పనులని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. 2018లో కొందరి కుట్ర వల్ల కొడంగల్‌లో ఓడిపోయానని చెప్పుకొచ్చారు. ఇక తాను ఏమీ చేయలేనని కొందరు భావించారని అన్నారు. మల్కాజ్‌గిరి ప్రజలు తనను ఎంపీగా గెలిపించారని తెలిపారు. దేశంలోని మహానగరాలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ, అంతర్జాతీయ స్థాయిలో మూసీరివర్ ఫ్రంట్ నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ఎవరేమనుకున్నా మూసీ నది ప్రక్షాళన చేసి తీరుతాం. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 55 కి.మీ మేరకు అంతర్జాతీయ స్థాయిలో రివర్‌ఫ్రంట్ పూర్తి చేసే బాధ్యత నాది. ప్రపంచ పర్యాటకులను ఆకర్షించే విధంగా భారత్ ఫ్యూచర్ సిటీ ని అభివృద్ధి చేస్తాం. సబర్మతీ, గంగా, యమునా నదుల రివర్‌ఫ్రంట్ల కన్నా అద్భుతంగా మూసీ రివర్‌ఫ్రంట్‌ను అభివృద్ధి చేస్తాం" అని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో ఏ పనులు చేయాలన్నా ఒక ప్రాంతం వైపు మాత్రమే చేపట్టారని, కూతవేటు దూరంలో ఉన్న ఎల్బీనగర్, బీఎన్ రెడ్డి నగర్, వనస్థలిపురం, హయత్ నగర్, గుర్రంగూడ, బైరామల్ గూడ, సాయబ్ నగర్ లాంటి ప్రాంతాలు అభివృద్ధికి నోచుకోలేదని పలు అంశాలను వివరించారు. ఈ విషయాలపై ఆలోచన చేసి జిల్లాలో ఈ ప్రాంతాలవైపు అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో పనులు చేపట్టామని చెప్పారు. అందులో భాగంగానే రూ. 2,400 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఫ్రూట్ మార్కెట్ నిర్మిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. గుర్రంగూడ స్థలాన్ని కూడా కబ్జా చేయాలని, కొందరు ప్రైవేటు వ్యక్తులు స్థలాన్ని లేఅవుట్ చేసి విక్రయించాలని ప్రయత్నిస్తే సుప్రీంకోర్టులో బలంగా వాదించి రక్షించుకున్నామని తెలిపారు. ఇందులో నేషనల్ పార్క్ కోసం వంద ఎకరాలను కేటాయించామని చెప్పారు. ఎల్బీ నగర్ ప్రాంతంలో 424 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో పార్క్‌ను నిర్మించడానికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించానని అన్నారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారు.. మూసీ పునరుజ్జీవం చేస్తామంటే కొందరు అడ్డుపడుతున్నారని ఆగ్రహించారు. మూసీ ఒడ్డున నివసిస్తున్న ప్రజలను తరలించి.. అభివృద్ధి చేస్తామంటే కొందరు మోకాలడ్డుతున్నారని మండిపడ్డారు. 30 వేల ఎకరాల్లో ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. సింగపూర్, హాంకాంగ్, టోక్యో, న్యూయార్క్‌లను చూసి గొప్ప నగరాలని ఎలా అనుకుంటున్నామో.. భవిష్యత్ తరాలు ఫ్యూచర్ సిటీని చూసి అలా అనుకునేలా తీర్చిదిద్దే బాధ్యత నాది అని స్పష్టంచేశారు. ఫ్యూచర్ సిటీ కడతామంటే మళ్లీ ఫార్మా కంపెనీలు తెస్తామంటున్నారని చెప్పుకొచ్చారు. ఫ్యూచర్ లేనివాళ్లు ఫ్యూచర్ సిటీ రద్దు చేస్తామంటున్నారని దుయ్యబట్టారు. ముందు సిద్దిపేట గెలిచిరండి.. ఆ తర్వాత రద్దుపై మాట్లాడదామని హితవు పలికారు. 60 శాతం గ్రీనరీ పెంచుతామంటే ఎన్జీటీలో కేసులు వేశారని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మంత్రులు శ్రీధర్ బాబు, కొండా సురేఖ, సీతక్క, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొత్తగూడెం బీఆర్ఎస్ పార్టీలో కొట్లాట

- **వనమా, వద్దిరాజు వర్గాల మధ్య ఫైటింగ్**
- **మా నియోజకవర్గంలో నీ పెత్తనం ఏంటి తక్కెలపల్లి అంటూ కార్యకర్తల ఫైర్**

**కొత్తగూడెం, మహా** కొత్తగూడెంలో నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తక్కెలపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. "కొత్తగూడెం నియోజకవర్గ కార్యక్రమానికి వరంగల్ జిల్లా నుంచి వచ్చి, మమ్మల్ని మా నియోజకవర్గ సమావేశానికి రావొద్దని చెప్పడానికి నువ్వెవడివి?" అంటూ వనమా వర్గీయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వనమా రాఘవపార్టీ నుండి సస్పెండ్ అయ్యారని, ఆయనకు సమావేశానికి వచ్చే అర్హత లేదని తక్కెళ్ళపల్లి తేల్చిచెప్పారు. దీంతో వనమా వర్గీయులు కుర్చీలు విరగ్గొట్టి.. బూతులు తిట్టగా, వద్దిరాజు రవిచంద్ర వర్గీయులు తక్కెళ్ళపల్లికి మద్దతుగా ఈ పరిణామాలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఇరు వర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.

## సచివాలయం ముట్టడికి జర్నలిస్టుల యత్నం

**హైదరాబాద్, మహా :** రాష్ట్ర ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్య వైఖరికి నిరసనగా, తమ డిమాండ్ల సాధనకై గురువారం జర్నలిస్టులు ''ఛలో హైదరాబాద్''కార్యక్రమం నిర్వహించారు. గన్ పార్క్ నుంచి సచివాలయం ముట్టడికి బయలుదేరిన జర్నలిస్టులను పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కమిటీ ఇచ్చిన ''ఛలో హైదరాబాద్'' పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల నుంచి తరలివచ్చిన జర్నలిస్టుల గన్ పార్క్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక, రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య గన్ పార్క్ లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద పూలు పెట్టి నివాళులర్పించి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మామిడి సోమయ్య మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో పన్నెండేళ్ళుగా జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించకుండా పాలకులు వివక్ష చూపుతున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం తెలంగాణ జర్నలిస్టులు అన్న నినాదంతో తెలంగాణ రాష్ట్రం కోసం పోరాడిన జర్నలిస్టులను పాలకులు చిన్నచూపు చూడడం దుర్మార్గమని ధ్వజమెత్తారు.

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినప్పటికీ, జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రభుత్వం మొండి చేయి చూపుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని దుయ్యబట్టారు. తెలంగాణలో అనేక చిన్న, మధ్య తరహా పత్రికలు మూతపడే పరిస్థితి ఏర్పడిందని, రెండున్నర సంవత్సరాలుగా ప్రభుత్వం అడ్వర్టైజ్మెంట్స్ బిల్స్ ఇవడం లేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్స్ వెంటనే ఇవ్వాలని, ప్రతి వర్కింగ్ జర్నలిస్టుకు అక్రెడిటేషన్ కార్డుతో పాటు హెల్త్ కార్డు ఇవ్వాలని, గ్రేటర్ హైదరాబాద్ తో సహా రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్లస్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎన్ఐ, పీఆర్జీఐ రిజిస్ట్రేషన్ తో రెగ్యులారిటీ ఉన్న పత్రికలను ఎంపానల్మెంట్ చేయాలని, జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లు, కళాశాలల్లో ఉచిత విద్యను అందించాలని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సదుపాయం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి జర్నలిస్టుకు ఉచిత బీమా పథకం ఏర్పాటు చేయాలని, 60 సంవత్సరాలు దాటిన జర్నలిస్టులకు పెన్షన్లు ఇవ్వాలని, జర్నలిస్టుల సంక్షేమానికి బడ్జెట్ లో రూ.100 కోట్లు కేటాయించాలని, జర్నలిస్టుకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన అనేక మంది జర్నలిస్టులు పాల్గొని ప్లకార్డులతో నినదించారు.

అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించగా పోలీసులు వారిని అడ్డుకొని అరెస్టు చేశారు. అరెస్టు చేసిన వారిని పంజాగుట్ట, ఆసిఫ్ నగర్ పోలీస్ స్టేషన్ లకు తరలించారు. ఈ నిరసన కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కోకన్వీనర్లు బండి విజయ్ కుమార్, యాదగిరి, తన్నీరు శ్రీనివాస్, నేషనల్ కౌన్సిల్ మెంబర్ చిర్రా శ్రీనివాస్, దామెర జగదీశ్వర్ గుప్తా, కే. పాండురంగారావు, పద్మనాభరావు, సామ్రాట్ గుప్తా, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవి కుమార్, కోకన్వీనర్లు ఆర్. శ్రీనివాస్ గౌడ్, సంతోష్ కుమార్, ఎం.రవికుమార్, సుభాష్, రేగటి వెంకన్న, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నానబాల రామకృష్ణ, అర్వపల్లి నగేష్, మహబూబ్ నగర్ జిల్లా కార్యాధ్యక్షుడు గండీటి నర్సింహా, కార్యదర్శి గోపాల్, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు మధు, సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్వాయి జానయ్య, ముషం హరిప్రసాద్, వరంగల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జక్కుల విజయ్ కుమార్, స్వామిదాస్, పాలడుగు సురేందర్, నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు దూమర్ల బాస్కర్, రంగారెడ్డి జిల్లా నాయకులు అశోక్ కుమార్ గౌడ్, పర్వతాలు, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మల్లేశం, గడ్డమీది అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## రౌడీషీటర్ సాయికృష్ణ మిస్సింగ్ కేసులో కీలక మలుపు

**విజయవాడ, మహా** : నగరంలో తీవ్ర సంచలనం సృష్టిస్తున్న రౌడీషీటర్ సాయికృష్ణ అదృశ్యం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీలను తక్షణమే భద్రపరచాలని కోరుతూ సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ మేరకు ఆమె దాఖలు చేసిన పిటిషన్‌పై విజయవాడ రెండో ఏజేఎం కోర్టు నేడు తీర్పును వెలువరించనుంది. పోలీసుల తీరుపై సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. కృష్ణలంక సీఐ నాగరాజు బలవంతంగా తన సెల్ ఫోన్ తీసుకుని పలు కాల్స్ చేశారని ఆమె ఆరోపించారు. తన కుమారుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లి తీవ్ర చిత్రహింసలకు గురిచేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. అసలు ఈ కేసులో నిజానిజాలు బయటకు రావాలంటే సీసీటీవీ ఆధారాలను తక్షణం కాపాడాలని ఆమె కోర్టును అభ్యర్థించారు. కృష్ణలంక పీఎస్‌లో తన కుమారుడు లాకప్ డెత్‌కు గురయ్యాడనే బలమైన అనుమానాలు ఉన్నాయని, అసలు సాయికృష్ణ బతికి ఉన్నాడో లేదో పోలీసులు స్పష్టం చేయాలని విజయలక్ష్మి కన్నీటిపర్యంతమవుతున్నారు. పోలీసులపై వస్తున్న తీవ్ర ఆరోపణల నేపథ్యంలో కేసు దర్యాప్తును ఉన్నతాధికారులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. సాయికృష్ణ మిస్సింగ్ కేసు విచారణ అధికారి (ఐఓ)గా రాజమండ్రి ఎస్పీ నరసింహ కిషోర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దర్యాప్తులో భాగంగా ఆయన నేడు కృష్ణలంక పోలీస్ స్టేషన్‌ను సందర్శించనున్నారు. ఇదిలా ఉండగా, తమ కుమారుడి అదృశ్యం వెనుక పోలీసుల హస్తం ఉందని ఆరోపిస్తున్న కుటుంబ సభ్యులు, ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగు చూడాలంటే సీబీఐ దర్యాప్తు జరిపించాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

## సాయికృష్ణ లాకప్ డెత్ ఘటనపై సీబీఐ విచారణకు వైఎస్ జగన్ డిమాండ్

- **బాధితుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ సీఎం**

**విజయవాడ, మహా :** విజయవాడ నగరంలో రౌడీషీటర్ సాయికృష్ణ అత్యంత పాశవికంగా లాకప్ డెత్‌కు గురైన ఘటనపై పూర్తిస్థాయిలో సీబీఐ విచారణ జరిపించాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. విజయవాడలోని కృష్ణలంక ప్రాంతంలో నివసిస్తున్న సాయికృష్ణ కుటుంబ సభ్యులను గురువారం ఆయన స్వయంగా పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన ఈ ఘటనపై సమగ్రమైన, స్వతంత్రమైన దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. విజయవాడ నగర నడిబొడ్డున ఇంతటి దారుణమైన ఘటన జరగడం పోలీసు వ్యవస్థ తీరుకు అద్దం పడుతోందని వైఎస్ జగన్ విమర్శించారు. ఈ వ్యవహారంలో కేవలం క్షేత్రస్థాయిలో ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ) మాత్రమే కాకుండా.. ఉన్నత స్థాయి పోలీసు అధికారుల పాత్రపైనా సమగ్ర విచారణ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. విజయవాడ నగర పోలీస్ కమిషనర్ (సీపీ), ఏసీపీలతో పాటు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) వరకు ఈ ఘటనలో ఎవరెవరి పాత్ర ఉందో దర్యాప్తు చేసి వారి బాధ్యతను నిర్ధారించాల్సిన అవసరం ఉందన్నారు. గత మే 9వ తేదీన పోలీసులు సాయికృష్ణను బలవంతంగా తీసుకెళ్లిన నాటి నుంచి.. తన కుమారుడి ఆచూకీ ఎక్కడో చెప్పాలంటూ ఆయన తల్లి ఎన్నోమార్లు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరిగి కన్నీరుమున్నీరైందని జగన్ గుర్తుచేశారు. కనీసం తన కొడుకును ఒక్కసారి చూపించాలని కోరినా అక్కడి అధికారులు సరైన సమాధానం ఇవ్వలేదని, కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదులను సైతం పూర్తిగా బుట్టదాఖలు చేశారని ఆరోపించారు. పోలీసుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతోనే బాధిత కుటుంబం కోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ కూడా దాఖలు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ఒక్కరు కాదు.. ఏకంగా ఇద్దరి మరణాలకు సదరు సీఐ కారణమయ్యాడనే బలమైన ఆరోపణలు వస్తున్నప్పటికీ, ఇప్పటివరకు పూర్తి స్థాయి దర్యాప్తు జరపకపోవడం వెనుక అర్థమేంటని ప్రశ్నించారు. ఒకవేళ సాయికృష్ణ ఏదైనా తప్పు చేసి ఉంటే.. చట్టప్రకారం న్యాయస్థానాలు ఆయనకు శిక్ష విధించేవని, కానీ పోలీసులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని ప్రాణాలు తీసే హక్కు ఎవరిచ్చారని నిలదీశారు. ఈ కేసులో దాగి ఉన్న అసలు నిజాలు, శక్తులు బయటకు రావాలంటే సీబీఐ విచారణే శరణ్యమని డిమాండ్ చేశారు. బాధితుడి కుటుంబానికి వైఎస్సార్‌సీపీ అన్ని విధాలా అండగా ఉంటుందని, వారికి పూర్తి న్యాయం జరిగే వరకు తాము పోరాటం కొనసాగిస్తామని వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్పష్టం చేశారు.



## రాయదుర్గం భూముల వేలంపై హైకోర్టు స్టే

**హైదరాబాద్:** రాయదుర్గంలోని టీజీఐఐసీ భూముల వేలంపై హైకోర్టు స్టే ఇచ్చింది. సర్వే నంబర్ 83/1లో ఇటీవల నిర్వహించిన భూముల వేలంపై 3 వారాలు స్టే విధించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని ఎస్‌బీఐ, టీజీఐఐసీ, గౌర వెంచర్స్‌కు నోటీసులు జారీ చేసింది. రాయదుర్గంలోనిt పన్మక్తలో టీజీఐఐసీ జరిపిన భూముల వేలంపై ఇటీవల ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. ఆ భూములు తమవేనంటూ పిటిషన్ దాఖలు చేసింది. దీంతో విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం వేలంపై స్టే విధించింది. ఇటీవల జరిగిన వేలంలో అక్కడ ఎకరం రూ.237 కోట్లు పలికిన సంగతి తెలిసందే. సర్వే నం .83/1లో ఐదు ఎకరాల భూమిపై హక్కులు కోరుతూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. మే 6న జారీ చేసిన వేలం నోటిఫికేషన్‌తోపాటు తదనంతరం జరిగిన భూ విక్రయాన్ని, తమ వినతిపత్రాన్ని తిరస్కరిస్తూ మే 20న జారీ చేసిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ఎస్‌బీఐ రెండు వేర్వేరు పిటిషన్లు దాఖలు చేసింది. రాయదుర్గంలో ఎస్‌బీహెచ్‌కు 2010లో ఐదెకరాల భూమిని ప్రభుత్వం కేటాయించగా ఇందుకోసం రూ. 13.33 కోట్లను చెల్లించింది. ఎస్‌బీఐలో ఎస్‌బీహెచ్ విలీనం కాగా, గతంలో ఈ స్థలంలో ఉన్న రెండు ఏటీఎంలను ఎస్‌బీఐ నిర్వహిస్తోంది. 2020లో గత ప్రభుత్వం భూకేటాయింపును రద్దు చేయగా ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించింది. కేటాయింపు ఉత్తర్వులను రద్దు చేస్తూ.. ఎస్‌బీఐ అభ్యర్థనను పునఃపరిశీలించాలని హైకోర్టు ఆదేశించింది. అనంతరం 2024లో ప్రస్తుత ప్రభుత్వం కూడా ఈ కేటాయింపును రద్దు చేయడంతో ఎస్‌బీఐ మరోసారి హైకోర్టును ఆశ్రయించింది.



## కర్నాటకలో డీకే షాక్

**మహా నెట్ వర్క్. :** కర్నాటకలోబిజెపి, జెడిఎస్ లకు చెందిన 11మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కు అనుకూలంగా ఓటేయడంతో కర్నాటకలో ఎమ్మెల్సీలన్నీ కాంగ్రెస్ గెలుచుకుంది. కర్నాటక సీఎం డీకే శివకుమార్ తనదైన శైలిలో బిజెపి, జెడిఎస్ కు షాకిచ్చారు. రెండుపార్టీలకు చెందిన 11మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ కు ఓటేయడంతో బలం లేకున్నా ఐదవ ఎమ్మెల్సీని కాంగ్రెస్ గెలిచింది. మరోవైపు జార్ఖండ్ రాష్ట్రంలోని రెండు రాజ్యసభ స్థానాలకు గురువారం జరిగిన ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కలకలం రేపింది. ఈ ఎన్నికల్లో ఎన్డీయే మద్దతుతో బరిలోకి దిగిన స్వతంత్ర అభ్యర్థి పరిమళ్ నత్వానీ, అధికార జార్ఖండ్ ముక్తి మోర్చా అభ్యర్థి బైద్యనాథ్ రామ్ విజయం సాధించారు. జేఎంఎం అభ్యర్థి రామ్ అత్యధికంగా 30 ఓట్లు కైవసం చేసుకోగా, పరిమళ్ నత్వానీ 28 ఓట్లతో గెలుపొందారు. అయితే, ఇండియా కూటమి తరఫున పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థి ప్రణవ్ ఝా కేవలం 20 ఓట్లకే పరిమితమై అనూహ్య ఓటమిని చవిచూశారు. ఈ ఎన్నికల్లో జరిగిన క్రాస్ ఓటింగ్‌తో కాంగ్రెస్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగలగా, ఎన్డీయేకు అనూహ్యంగా అదృష్టం వరించింది. జార్ఖండ్ శాసనసభలో ఎన్డీయే కూటమికి కేవలం 24 మంది ఎమ్మెల్యేల (బీజేపీ 21, ఎల్‌జేపీరామ్ విలాస్ 1, ఏజేఎస్‌యూ 1, జేడీయూ 1) బలం మాత్రమే ఉంది. అయినప్పటికీ నత్వానీకి 28 ఓట్లు రావడం క్రాస్ ఓటింగ్ జరిగిందనడానికి స్పష్టమైన నిదర్శనంగా నిలిచింది. మరోవైపు, అసెంబ్లీలో ఇండియా కూటమికి ఏకంగా 56 మంది ఎమ్మెల్యేల (జేఎంఎం 34, కాంగ్రెస్ 16, ఆర్జేడీ 4, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ 2) బలముంది.

# తెలంగాణా రైతాంగానికి తీపి కబురు




**హైదరాబాద్, మహా :** ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా పెట్టుబడి సాయాన్ని జూన్ 30న ఖమ్మం జిల్లా మధిరలో నిర్వహించే భారీ రైతు సమ్మేళనం ద్వారా అధికారికంగా ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఖమ్మం జిల్లా మధిరలో బహిరంగ సభను నిర్వహించి, అదే వేదిక నుంచి తెలంగాణ వ్యాప్తంగా రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతు భరోసా నిధులను నేరుగా జమ చేయనున్నట్లు వెల్లడించారు. వ్యవసాయం, రైతు సంక్షేమం, ఎరువుల లభ్యత, పంటల కొనుగోలు, హైదరాబాద్ మెట్రో విస్తరణ, పరిపాలనా సంస్కరణలకు సంబంధించి తీసుకున్న కీలక నిర్ణయాలను సమావేశం అనంతరం సచివాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సహచర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, సీతక్కలతోకలిసి పత్రికా విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తున్న బోనస్‌ను ఏడు సన్నరకాల వరి వంగడాలకు కొనసాగించాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు తెలిపారు. మార్కెట్ డిమాండ్, వినియోగదారుల అభిరుచులను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. బోనస్ బీపీటీ5204, ఆర్ఎన్ఆర్15048, హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం1638, డబ్ల్యూజీఎల్44, కేఎన్ఎం7715 వరి వంగడాలకు మాత్రమే వర్తిస్తుందని వివరించారు. ఈ వంగడాలు రాష్ట్రంలో సాగవుతున్న సన్నబియ్యం పంటలో దాదాపు 83 శాతం వాటాను కలిగి ఉండటమే కాకుండా ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థ వెలుపల కూడా మంచి మార్కెట్ డిమాండ్ కలిగి ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణకు ఎరువుల కేటాయింపుల విషయంలో కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుపై మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. నెలకు సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తామని కేంద్రం హామీ ఇచ్చినా, గత కొన్ని నెలలుగా ఆ మేరకు సరఫరా జరగలేదని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, తెలంగాణకు ఇప్పటివరకు మరింత అధిక స్థాయిలో ఎరువుల నిల్వలు అందాల్సి ఉందన్నారు. అలాగే రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్ఎఫ్‌సీఎల్)లో ఉత్పత్తి అవుతున్న యూరియాలో అధిక భాగాన్ని తెలంగాణ రైతులకు కేటాయించాలని ప్రభుత్వం డిమాండ్ చేసింది. స్థానికంగా ఉత్పత్తి అవుతున్న ఎరువులను రాష్ట్ర రైతులకు అందించడం ద్వారా రవాణా వ్యయాలు తగ్గడంతో పాటు వ్యవసాయ సీజన్‌లో ఎరువుల కొరతను నివారించవచ్చని మంత్రులు అభిప్రాయపడ్డారు.

వాతావరణ శాఖ అంచనాల ప్రకారం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉండటం, మధ్య మధ్యలో పొడి వాతావరణ పరిస్థితులు నెలకొనే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు తొలి వర్షాలు పడగానే విత్తనాలు వేయడానికి తొందరపడవద్దని ప్రభుత్వం సూచించింది. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి, నేలలో తగినంత తేమ ఏర్పడిన తర్వాత మాత్రమే విత్తనాలు వేయాలని కోరింది. సాధారణంగా మొలకెత్తడానికి, పంట ప్రారంభ వృద్ధికి కనీసం 7 మిల్లీమీటర్ల చొప్పున రెండు దఫాల వర్షపాతం అవసరమవుతుందని పేర్కొంది. వర్షాలు పడగానే తొందరపడి విత్తనాలు వేస్తే, అనంతరం పొడి వాతావరణం ఏర్పడిన పక్షంలో పంట నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించింది. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణకు అవసరమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

ఇండియన్ రైల్వే ఫైనాన్స్ కార్పొరేషన్ (ఐఆర్ఎఫ్‌సీ) ద్వారా ప్రతిపాదించిన రుణానికి వెంటనే ఆమోదం తెలపాలని కేంద్రాన్ని కోరనున్నట్లు చెప్పారు. తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు, బీజేపీ ఎంపీలు కూడా హైదరాబాద్ ప్రజల ప్రయోజనాల దృష్ట్యా ఈ ప్రాజెక్టుకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వేగంగా విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్యలను తగ్గించడానికి, ప్రజల రవాణా అవసరాలను తీర్చడానికి మెట్రో విస్తరణ అత్యంత కీలకమని పేర్కొన్నారు. పరిపాలనా సంస్కరణల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ క్యాబినెట్ వ్యవస్థను ప్రవేశపెడుతున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

ఐటీ శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, మంత్రులకు ప్రత్యేక ట్యాబ్‌లను అందించినట్లు చెప్పారు. కాగిత రహిత పరిపాలనను ప్రోత్సహించడం, పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడం ఈ నిర్ణయ లక్ష్యమని వివరించారు. ఇకపై క్యాబినెట్ నోట్లు, అజెండాలు, ఇతర అధికారిక పత్రాలు ఎక్కువగా డిజిటల్ రూపంలోనే నిర్వహించబడతాయని, దీంతో కాగిత వినియోగం తగ్గడంతో పాటు నిర్ణయ ప్రక్రియ మరింత వేగవంతం అవుతుందని తెలిపారు. రాబోయే నీట్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.95 లక్షల మంది విద్యార్థులు 2,008 కేంద్రాల్లో పరీక్ష రాయనున్నట్లు అంచనా. హాల్ టికెట్ చూపించిన విద్యార్థులకు ఉచిత ప్రయాణం కల్పించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. విద్యార్థులు, వారి కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గించడమే ఈ నిర్ణయ లక్ష్యమని పేర్కొంది.

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్)లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మార్పుల ప్రభావాన్ని అధ్యయనం చేసేందుకు మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసినట్లు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. ఈ ఉపసంఘంలో మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్ వెంకటస్వామి, సీతక్క సభ్యులుగా ఉంటారని చెప్పారు.ఇతర రాష్ట్రాల్లో జరుగుతున్న పరిణామాలను అధ్యయనం చేసి, తెలంగాణపై పడే ఆర్థిక భారం ఎంత ఉంటుందో అంచనా వేసి, రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన తదుపరి చర్యలపై సిఫారసులు చేయనుందని తెలిపారు. కొన్ని ప్రతిపాదిత మార్పులు గ్రామీణ ఉపాధి అవకాశాలను తగ్గించే ప్రమాదం ఉండటంతో పాటు రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపే అవకాశం ఉందని ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఉపసంఘం అన్ని వర్గాల అభిప్రాయాలను సేకరించి త్వరలోనే నివేదిక సమర్పించనుంది. ఇటీవలి యాసంగి సీజన్‌లో తెలంగాణ ప్రభుత్వం రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోలు చేసినట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దాదాపు 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం దేశంలోనే ఈ సీజన్‌లో ఏ రాష్ట్రం సాధించని ఘనత అని పేర్కొన్నారు. దేశ ఆహార ధాన్య నిల్వలకు తెలంగాణ ప్రధాన సహకార రాష్ట్రంగా అవతరించిందని చెప్పారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన చెల్లింపులను రైతుల బ్యాంకు ఖాతాల్లో 48 గంటల వ్యవధిలోనే నేరుగా జమ చేయడం ద్వారా పారదర్శకతను, రైతుల ఆర్థిక భద్రతను ప్రభుత్వం నిర్ధారించిందన్నారు.

తాజా కొనుగోలు సీజన్‌లోనే సుమారు రూ.18,000 కోట్లు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుత వ్యవసాయ చక్రంలో మొత్తం రూ.38,00039,000 కోట్ల వరకు రైతులకు చెల్లింపులు జరిగాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల కాలంలో కొనుగోలు కార్యకలాపాల ద్వారా రైతులకు దాదాపు రూ.1 లక్ష కోట్లకు పైగా చెల్లింపులు జరిగాయని, ఇదే సమయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ పదేళ్ల పాలనలో సుమారు రూ.1.30 లక్షల కోట్లు చెల్లించబడినట్లు వివరించారు.

**కేంద్ర కొనుగోలు విధానంపై ఆందోళన**

తెలంగాణలో పండుతున్న పంటలను కేంద్ర సంస్థలు తగిన స్థాయిలో కొనుగోలు చేయకపోవడంపై మంత్రులు ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ స్థాయిలో ధాన్యాన్ని కొనుగోలు చేయడమే కాకుండా, సుమారు 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కూడా కొనుగోలు చేసినప్పటికీ, కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) వ్యవస్థలో కేంద్ర సంస్థలు ఆశించిన స్థాయిలో కొనుగోళ్లు చేయడం లేదని పేర్కొన్నారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌సీఐ) ద్వారా ధాన్యం, కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా పత్తి, నాఫెడ్ ద్వారా ఇతర పంటలను కొనుగోలు చేసే విషయంలో కేంద్ర ప్రభుత్వం తన రాజ్యాంగ, విధానపరమైన బాధ్యతలను నిర్వర్తించాలని డిమాండ్ చేశారు. పంటల కొనుగోలు అంశంపై కేంద్ర ప్రభుత్వ దృష్టిని ఆకర్షించేందుకు తెలంగాణకు చెందిన మంత్రులు, ఎంపీలు త్వరలోనే న్యూఢిల్లీకి వెళ్లి కేంద్రాన్ని కలవనున్నట్లు తెలిపారు.

## ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్

### మంత్రి పొన్నం సమీక్ష



**హైదరాబాద్, మహా :** ఆర్టీసీ సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆర్పీఎస్2021కు సంబంధించిన 11 శాతం ఫిట్‌మెంట్‌ను జూలై 1 నుంచి అమలు చేస్తున్నట్లు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికల అధికారితో చర్చించి సంఘాల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. ఆత్మహత్య చేసుకున్న ఉద్యోగి శంకర్ కుటుంబానికి ఉద్యోగుల నుంచి సేకరించిన నిధులతో త్వరలో రూ.1 కోటి చెక్కు అందజేయడంతో పాటు కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసే ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ఏర్పడి 30 నెలలు పూర్తయిన సందర్భంగా టీజీఎస్ఆర్టీసీ పురోగతి, భవిష్యత్ కార్యాచరణపై గురువారం సచివాలయంలో మంత్రి ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉద్యోగుల ప్రమాద బీమా పథకం కింద ఇప్పటివరకు 11 కేసులను పరిష్కరించి ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున చెక్కులు అందించినట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ, ఈవీ విధానం, ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణపై దక్షిణ భారత రాష్ట్రాల రవాణా శాఖ మంత్రులు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, కమిషనర్లు, ఆర్టీసీ ఎండీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్టీసీ బస్ స్టేషన్‌ల అభివృద్ధికి అవసరమైన భూ బదలాయింపు ప్రక్రియలను వేగవంతం చేయాలని అధికారులకు మంత్రి సూచించారు.

## పెట్రోల్ బంక్ ఎదుట మహిళ హల్చల్



**వరంగల్ మహా ;**వరంగల్ నగరంలోని ఓ పెట్రోల్ బంకులో తాను చేసిన జీతం డబ్బులు బంకు యాజమాన్యం తనకు ఇవ్వడం లేదని ఆరోపిస్తూ, తనకు రావాల్సిన జీతం డబ్బులు తనకు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మహ్మద్ రజియా అనే మహిళ గురువారం ఉదయం వరంగల్ అండర్ బ్రిడ్జ్ సమీపంలో గల ఇండియన్ ఆయిల్ బంకు ముందు హల్ చల్ చేసింది. సదరు మహిళ బంకు యాజమాన్యం పై 100 కు డయల్ చేయడంతో స్థానిక మిల్స్ కాలనీ పోలీసులు బంకు వద్దకు చేరుకొని మహిళ వద్ద వివరాలు సేకరించి ఆమెను సముదాయించే ప్రయత్నం చేసిన ఆ మహిళా ఏ మాత్రం శాంతించక బంకు ముందు ఉన్న ప్రధాన రోడ్డు పై బైటయించింది. దీంతో వరంగల్ అండర్ బ్రిడ్జ్ ప్రధాన రోడ్డుపై భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఇదిలా ఉండగా బంకు సిబ్బంది మాత్రం సదరు మహిళా డ్యూటీ లో వుంటూ లెక్క చూపకుండా డబ్బులు సొంతానికి వాడుకున్నట్లు తెలిపారు. పైగా తనకే డబ్బులు వస్తాయని ఇక్కడికి వచ్చి న్యూసెన్స్ చేస్తుందని అన్నారు. ఇదంతా విన్న పోలీసులు ఆ మహిళ సమస్య పట్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని అనడంతో పోలీసులతో పాటు అదే వాహనంలో పోలీస్ స్టేషన్ కు వెళ్లి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



## పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

**యాదాద్రి భువనగిరి జూన్ 18 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం ఫకీరుగూడెం గ్రామంలో గురువారం పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి సన్మానించారు. అనంతరం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరిపై ఉండాలని, గ్రామంలో సుఖశాంతులు, ఐశ్వర్యాలు నెలకొనాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు గ్రామ దేవతల ఆలయాలు ప్రతీకలని అన్నారు. గ్రామాల్లో ప్రజల ఐక్యత, భక్తి, ఆధ్యాత్మికతకు ఇలాంటి ఆలయాలు కేంద్ర బిందువులుగా నిలుస్తాయని పేర్కొన్నారు. పెద్దమ్మ తల్లి ఆశీస్సులతో గ్రామం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వ పరిరక్షణకు కట్టుబడి ఉందని తెలిపారు. ప్రజల సహకారంతో గ్రామాల్లో ఆలయాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. భక్తి భావంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## కళ్యాణలక్ష్మి పథకం పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా

- **ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య**

**యాదాద్రి భువనగిరి జూన్ 18 మహా :** యాదాద్రి భువనగిరి జిల్లా బొమ్మలరామారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో మండలానికి చెందిన పలువురు అర్హులైన లబ్ధిదారులకు గురువారం ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కళ్యాణలక్ష్మి పథకం చెక్కులను స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద మరియు మధ్యతరగతి కుటుంబాల సంక్షేమాన్ని లక్ష్యంగా చేసుకుని అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. అందులో కళ్యాణలక్ష్మి పథకం అత్యంత ముఖ్యమైనదని, ఆడబిడ్డల వివాహాల సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారం తగ్గించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతోందని పేర్కొన్నారు.ముఖ్యమంత్రి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అధికారులు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పాటించాలని సూచించారు.కళ్యాణలక్ష్మి పథకం ద్వారా వేలాది కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయని, ఆడపిల్లల వివాహాల విషయంలో తల్లిదండ్రులకు ఇది గొప్ప ఆర్థిక సహాయంగా నిలుస్తోందని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వల్ల పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయని పేర్కొన్నారు.అనంతరం లబ్ధిదారులకు చెక్కులను అందజేసి వారి కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కార్యాలయ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఇరాన్‌కు అమెరికా ఘాటు హెచ్చరిక!

- * ఒప్పంద నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవు.
- * మళ్లీ సైనిక చర్యలకు సిద్ధమన్న రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్.
- * సముద్ర దిగ్బంధనాన్ని అమలు చేసే సామర్థ్యం మాకుంది.



**బ్రస్సెల్స్,మహా:** అమెరికాఇరాన్ ఒప్పందంలోని హామీలను ఇరాన్ గనుక సరిగ్గా పాటించకపోతే, ఆ దేశంపై మళ్లీ సైనిక చర్యలు చేపట్టేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ గురువారం హెచ్చరించారు. నాటో రక్షణ మంత్రుల సమావేశం అనంతరం బ్రస్సెల్స్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

ఒప్పందం అమలు, చర్చల సమయంలో ఇరాన్ నిబంధనలను ఉల్లంఘిస్తే ట్రంప్ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ చర్చల గడువులోగా ఇరాన్ చెప్పినట్లు చేయకపోతే, తాము మళ్లీ చర్యలు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉంటామని దేశ అధ్యక్షుడు స్పష్టం చేశారని గుర్తుచేశారు. ఒకవేళ ఇరాన్ నిబంధనలు పాటించకపోతే, అత్యంత కఠినమైన సముద్ర దిగ్బంధనాన్ని మళ్లీ అమలు చేసే పూర్తి సామర్థ్యం తమకు ఉందని పీట్ హెగ్‌సెత్ తేల్చిచెప్పారు.

అమెరికాఇరాన్ మధ్య దాదాపు 3 నెలలకు పైగా సాగిన తీవ్ర ఘర్షణలకు ముగింపు పలికే లక్ష్యంతోనే ఇటీవల ఇరు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందంలో శత్రుత్వానికి ముగింపు పలకడం, హోర్ముజ్ జలసంధిని తిరిగి తెరవడం, ఆంక్షల సడలింపుతో పాటు ఇరాన్ అణు కార్యక్రమంపై విస్తృత స్థాయి ఒప్పందం కోసం 60 రోజుల చర్చల ప్రక్రియను ప్రారంభించడం వంటి కీలక అంశాలు ఉన్నాయి. ఇరు పక్షాలు ఈ ఒప్పందాన్ని స్వాగతించినప్పటికీ, ఒప్పందం ద్వారా లభించే ఆంక్షల సడలింపు, ఇతర ప్రయోజనాలు వంటివి ఇరాన్ తన బాధ్యతలను పూర్తిగా నెరవేర్చిన తర్వాతే అమలులోకి వస్తాయని అమెరికా అధికారులు స్పష్టం చేస్తున్నారు. తాజా వ్యాఖ్యలతో, ఒప్పందం అమలు సమయంలో ఇరాన్ తీసుకునే ప్రతి చర్యను ట్రంప్ ప్రభుత్వం నిశితంగా పరిశీలించనున్నట్లు మరోసారి సంకేతాలు ఇచ్చింది. ఈ ఒప్పందాన్ని "పనితీరు ఆధారిత ఒప్పందం"గా పేర్కొంటున్నారు. ఇందులో ఆంక్షల సడలింపు, నిలిపివేసిన నిధుల విడుదల, ఇతర చర్యలన్నీ ఇరాన్ తీసుకునే నిర్ణయాలపైనే ఆధారపడి ఉంటాయి.

అయితే ఇరాన్ నిధుల విడుదల, సముద్ర ఆంక్షల సడలింపు వంటి హామీలను ఏ క్రమంలో అమలు చేయాలనే విషయంలో రెండు పక్షాల మధ్య ఇంకా విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. గత ఘర్షణల సమయంలో హోర్ముజ్ జలసంధిలో అంతరాయం ఏర్పడటంతో అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో తీవ్ర హెచ్చుతగ్గులు కనిపించాయి. దీనివల్ల అనేక నౌకలు ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి వచ్చింది. ఈ ఒప్పందంతో ఆ ప్రాంతంలో సముద్ర రాకపోకలు మళ్లీ సాధారణ స్థితికి వస్తాయని వాషింగ్టన్ భావిస్తోంది. అదే సమయంలో ఇరాన్ ఒప్పంద నిబంధనలు పాటించకపోతే, సైనిక, ఆర్థిక ఒత్తిడిని మళ్లీ తీసుకురావచ్చునని అమెరికా స్పష్టం చేసింది.

## కేటీఆర్ వ్యాఖ్యలపై గిరిజన సంఘాల అగ్రహం

ములుగు,మహా: జిల్లాలోని ఇసుక క్వారీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను మండలంలోని పలు గిరిజన సంఘాలు, నాయకులు తీవ్రంగా ఖండించారు. గురువారం వాడగూడెంలో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, గిరిజన ఇసుక సొసైటీల ద్వారా వేలాది మంది గిరిజనులు ఉపాధి పొందుతూ ఆర్థిక పురోగతి వైపు అడుగులు వేస్తున్న తరుణంలో, వారి అభివృద్ధిని అడ్డుకునేలా కేటీఆర్ మాట్లాడటం తగదన్నారు.గత బీఆర్ఎస్ పాలనలో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పేరుతో జరిగిన ఇసుక దోపిడీపై స్పందించని కేటీఆర్, ప్రస్తుతం ప్రజా ప్రభుత్వంలో గిరిజనుల అభివృద్ధికి ఉపయోగపడుతున్న క్వారీలపై వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదన్నారు. పేద ప్రజల పొట్టగొట్టేలా చేసిన వ్యాఖ్యలను ఆయన వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ప్రైవేట్ స్కూళ్లలో ఫీజు పుస్తకాల దోపిడిని ఆపాలి

- **యాదాద్రి జిల్లా DEO కి వినతి**
- **పల్లగొర్ల మోదీరాందేవ్**



**భువనగిరి జూన్ 18 మహా న్యూస్:**యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రవేట్ స్కూల్లు ఇష్టరాజ్యాంగ ఫీజు పుస్తకాల దోపిడిపై కఠిన చర్యలు తీసుకొవాలని యాదాద్రి జిల్లా డీఈవో బిక్షపతికి గురువారంవినతిపత్రం ఇచ్చి వారిని సన్మానించారు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ సామాజిక కార్యకర్త నిమ్మల వీరన్న వారు మాట్లాడుతూ ఫీజు పుస్తకాల దోపిడి చేస్తున్న ప్రైవేట్ స్కూల్ లపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు అలాగే శానిటైజేషన్ బిల్డింగ్ సేఫ్టీ టెట్ అర్హత,ఫైర్ సేఫ్టీ బస్సుల ఫిట్నెస్ అధిక ఫీజులు టీసీ విషయంలో వేధింపులు చేస్తున్న ప్రైవేట్ స్కూళ్లను గుర్తించి స్కూలు సీజ్ చేసి యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి అన్నారు 1 ప్రైవేట్ స్కూళ్లలో పుస్తకాలు అమ్మడం పూర్తిగా నిషేధించాలి. అని ఎక్కడైనా పుస్తకాలు అమ్ముతున్నట్లు తెలిస్తే ఆ స్కూళ్లను తక్షణమే సీజ్ చేయాలి. అని అధికారులకు విజ్ఞప్తి చేశారు 2 అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యార్థుల రక్తం తాగుతున్న ప్రైవేట్ స్కూళ్లను గుర్తించి వాటిని సీజ్ చేయాలి. వారు డిమాండ్ చేశారు 3 సరైన గుర్తింపు అనుమతులు లేని ప్రైవేట్ స్కూళ్లను మూసివేయాలి. అన్నారు శానిటైజర్ మరియు బిల్డింగ్ సేఫ్టీ సర్టిఫికెట్లు లేని స్కూళ్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. తెలిపారు 4 టెట్ అర్హత లేని ఉపాధ్యాయులను తొలగించాలి. ఫైర్ సేఫ్టీ ప్రమాణాలు పాటించని స్కూళ్లపై యాక్షన్ తీసుకోవాలి. 5 ఫిట్నెస్ లేని స్కూల్ బస్సుల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలి. యజమాన్యం పై కఠిన చర్యలు తీసుకోవాలి ప్రైవేట్ స్కూల్ నుండి గవర్నమెంట్ స్కూల్ కి వస్తున్న విద్యార్థులను టీసీ విషయంలో వేధిస్తున్న స్కూళ్లను గుర్తించి, యజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి. బుక్ ఫీజ్ అని బడి ఫీజు అని బస్సు ఫీజు అని ట్యూషన్ ఫీజ్ అని డొనేషన్ ఫీజ్ అని ప్రైవేట్ విద్యాసంస్థలు దోచుకుంటున్నారు స్కూల్లో ఎలాంటివి అమ్మొద్దని గైడ్లైన్స్ ఉన్న అవి పెడచెవిన పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు అని వారు మండిపడ్డారు 2005 ఫీజు నియంత్రం చట్ట అమలులో ఉన్న అవన్నీ పట్టించుకోకుండా విద్యార్థుల రక్తం తాగుతున్నారు అలాంటి ప్రైవేట్ విద్యాసంస్థలను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని,, విద్యాశాఖ మంత్రిని నియమించి ప్రభుత్వ స్కూల్లో మెరుగైన వసతులు కల్పించాలని ప్రభుత్వం వెంటనే ఫీజు నియంత్రణ చట్టం అమలు తీసుకొచ్చి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు ఈ సమావేశంలో బీసీ విద్యార్థి సంఘ రాష్ట్ర కన్వీనర్ పల్లగొర్ల మోదీరాందేవ్ సామాజివేత్త నిమ్మల వీరన్న, ఎడ్ల మహాలింగం ధరావత్ గిరిధర్ సందీప్రాకేష్ అజయ్అఖిల్ యుగంధర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

## కంకర తేలిన రోడ్లతో ప్రజలకు ఇబ్బందులు

**భువనగిరి జూన్ 18 మహా న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామంకి నల్లుదిక్కుల రోడ్లు అన్ని గుంతలమయంతో కంకర రాళ్లు తేలి గ్రామానికి రావడానికి ప్రయాణికులు గాని ప్రజలు గాని అనేక ఇబ్బందులు పడుతున్నారని పాలకులు ప్రభుత్వ అధికారులు పట్టించుకోవడంలేదని BRS పార్టీ యూత్ నాయకులు మేడి రాజు ఆవేదన వ్యక్తం చేశారు. చిట్యాల నుండి ఉత్తటూరుకు ఇస్కిళ్లకు రావాలంటే ఇబ్బంది పడుతున్నారని. జనంపల్లి నుండి ఉత్త టూర్ కి రోడ్డు సౌకర్యం లేదన్నారు ఉత్త టూర్ నుండి పిల్లిగూడం మీదుగా కక్కిరేణి వరకు రోడ్డు సౌకర్యం లేదనీ ఉత్తటూరు నుండి ఇస్కిల్ల మీదుగా మునిపంపుల బ్యాంకుకు వెళ్లాలన్న చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాని ఆయన అన్నారు దీంతోపాటు ఉత్త టూర్ నుండి మాంద్రకు వెళ్లాలన్న గుంతలమయంతో అనేక రకాలుగా ప్రజలు ఇబ్బంది పడుతున్న పాలకులు నిమ్మకు నీరు ఎత్తిన వ్యవహరిస్తున్నారని వెంటనే అధికారులు ప్రభుత్వం స్పందించి గ్రామంలోకి వీలుగా నలుదిక్కుల నుండి ఇతర గ్రామాల వరకు రోడ్డు సౌకర్యం కల్పించి విద్యార్థులకు అనుగుణంగా బస్సులు వేయాలని కోరారు. గతంలో చిట్యాల నుండి వనిపాకల ఉత్తటూరు ఇస్కిల్లా కక్కిరెని వరకు ఉదయం సాయంత్రం బస్సు నడిచేదని ఇప్పుడు అది రావడంలేదని అధికారులు ప్రజల కు ఇబ్బందులు కాకుండా చూడాలని కోరారు

ANN తెలుగు
మహా పత్రిక
శుక్రవారం, హైదరాబాద్
19-06-2026
Mahaa Special
WWW.MAHAADAILY.COM


## ప్రపంచం అబ్బుర పడేలా...

# భారత్ ఫ్యూచర్ సిటీ



### పెట్టుబడిదారులను ఇట్టే ఆకట్టుకునే వ్యూహం

- దేశంలోనే ప్రప్రథమంగా నెట్ జీరో కార్బన్ సిటీ..
- వ్యాపార దిగ్గజాలకు వేదికగా వరల్డ్ ట్రేడ్ సెంటర్
- ఏ రంగంలోనైనా పెట్టుబడులు పెట్టేలా ఆహ్వానం
- ప్రతి రంగంలో సుస్థిరత సాధించేలా వనరులు
- ఫ్యూచర్ సిటీకి అనుబంధంగా 6 సిటీలు



దేశాన్ని మెప్పించడం... ప్రజలను ఒప్పించడం.. ఒక ఎత్తయితే, ప్రపంచాన్ని ఆకర్షించడమే ఏకైక లక్ష్యంగా రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ముందడుగు వేస్తోంది. మనకు మేలు చేసే రంగంలోనే కాదు... ప్రపంచ రుబేరులరు, బహుళజాతి కంపెనీల అధినేతలకు మెచ్చే ఏ రంగంలోనైనా పెట్టుబడులు పెట్టేలా వ్యూహాత్మక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. ఇప్పటికిప్పుడు ఫలితం కనిపించకపోయినా, అశించిన ప్రయోజనాలు దూరంగా ఉన్నా... వచ్చే వందేళ్ల ముందుచూపుతో బలమైన పునాదులు వేస్తోంది. ఆ దిశగా మూడు నెలల పాలు సుధీర్ఘ కసరస్తు అనంతరం రూపొందించిన 'ఫ్యూచర్ సిటీ' లక్ష్యాలను ప్రపంచం ముందు ఆవిష్కరించేందుకు సీఎం రేవంత్ రెడ్డి సంసిద్ధమయ్యారు. కొత్త ఆలోచన.. సరికొత్త విధానంతో 'భారత్ ఫ్యూచర్ సిటీ' వైపు ప్రపంచం ఆకర్షితులయ్యేలా. పెట్టుబడిదారులను ఇట్టే ఆకట్టుకునేలా ప్రత్యేక వ్యూహం అమలు చేస్తున్నారు. హైదరాబాద్ కు మహోన్నత స్థానం కల్పించి అద్భుత నగరంగా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్ రెడ్డి తన బృందంతో న్యూయార్క్ నుంచి లండన్ దాకా విస్తృతంగా పర్యటించి వచ్చారు.ఫ్యూచర్ సిటీ భవిష్యత్తులో ఇండియాకు సమాధానం అవుతుందని, ఇది ఇండియా మొదటి నెట్ జీరో కార్బన్ సిటీ అవుతుందని ఆయన అనేకసార్లు ప్రకటించారు. ఫ్యూచర్ సిటీలో ఆర్టిఫిషియల్ (ఏఐ) మెడికల్ టూరిజం, స్పోర్ట్స్, సాఫ్ట్వేర్ అలాగే ఫార్మాకు సెంటర్ ఆఫ్ అట్రాక్షన్గా మారుతుందని ఆయన అధికాలరులతో సమీక్ష సందర్భంగా చెప్పారు. ఫ్యూచర్ సిటీకి వివిధ ప్రాంతాల నుంచి రోడ్డు, రైలు మార్గాలపై ప్రణాళికలు తయారు చేసి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని అధికారులను ఇటీవలే సీఎం ఆదేశించారు. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగు రోడ్డును అనుసంధానం చేసేలా ప్రణాళిక చేయాలన్నారు. కొత్త హైకోర్టు నుంచి శంషాబాద్ విమానాశ్రయం మీదుగా ఫ్యూచర్ సిటీకి మెట్రో మార్గానికి ప్రణాళికలు తయారు చేయాలని సీఎం సూచించగా.. అధికారులు కొన్ని ప్రతిపాదనలను సిద్ధం చేశారు. అవుటర్ రింగ్ రోడ్డు నుంచి రీజనల్ రింగు రోడ్డును అనుసంధానం చేసేలా ప్రణాళిక కూడా సిద్ధమైంది.



(రాజేష్ జైన్ నిడార్కర్)



### ప్రతి నిర్ణయం పైనా.. అనుభవజ్ఞులతో కలిసి సమాలోచనలు

ఈ రంగాల్లో పెట్టుబడుకు సంబంధించి ఇప్పటికే కుదిరిన ఒప్పందాలన్నీ గ్రౌండింగ్ అయ్యేలా చేసేందుకు మౌళిక వసతుల కల్పన అత్యంత ప్రధానం కావడంలో ఆ దిశగా దృష్టి పెట్టారు. ఇందుకు సంబంధించి 'క్రీడాయ్' ప్రతినిధులతో తాజాగా రేవంత్రెడ్డి సమాలోచనలు జరిపారు. స్థిరాస్తి వ్యాపార రంగంలో 3 దశాబ్దాల అనుభవం కలిగిన ఆ సంస్థ ప్రతినిధుల ఆలోచన మేరకు ఫ్యూచర్ సిటీలో లివింగ్ సిటీలు అవసరమన్న నిర్ణయానికి ప్రభుత్వం వచ్చింది. ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫార్మా సిటీ కంపెనీలకు మానవ వనరులకు సమకూర్చడం, అందుకు వెసులుబాటు కల్పిస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. నివాస గృహ సముదాయాల నిర్మాణానికి భూములు కేటాయించి ఇప్పటి నుంచే లేఅవుట్లు సిద్ధం చేసే పనులు ప్రారంభించాలని, అలాగైతే.. పెట్టుబడులకు ముందుకు వచ్చే బహుళజాతి కంపెనీలను మరింతగా ఆకర్షించవచ్చునని సర్కారు భావిస్తోంది. వంద ఎకరాలకు ఒకటి చొప్పున లివింగ్ సిటీలను ఏర్పాటుకు దిశగా యోచిస్తోంది. ఆ దిశగా అధికారులు కసరత్తు చేస్తున్నారు. చంద్రబాబు హయాంలో మాదాపూర్లో నిర్మించిన హైటెక్ సిటీ తరహాలో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. క్రెడాయ్ ప్రతిపాదనకు సీఎం సూచనప్రాయ అంగీకారం తెలిపి అధికార యంత్రాంగానికి మార్గదర్శకాలు ఇచ్చారు. అధికారులు ఇచ్చిన నివేదిక ప్రకారం.. ఫోర్త్ సిటీని ఎంపిక చేసిన ప్రాంతంలో అందుబాటులో 15 నుంచి 16 వేల ఎకరాల ప్రభుత్వ భూమి అందుబాటులో ఉంది. దాన్ని సద్వినియోగం చేసుకునే దిశగా ప్రభుత్వం కార్యాచరణ మొదలుపెట్టింది.



### 70 ఎకరాల విస్తీర్ణంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్..

ప్రపంచ దేశాల వాణిజ్యం అంతా కేంద్రీకృతమయ్యేలా ఓ ట్రేడ్ సెంటర్ను నిర్మించాలని సీఎం రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇతర దేశాల్లో వాణిజ్య కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు వరల్డ్ ట్రేడ్ సెంటర్స్ అసోసియేషన్ రైట్స్ తీసుకుంది. తెలంగాణాలో మొదటి వాణిజ్య కేంద్రాన్ని హైదరాబాద్లో నిర్మిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ4.0లో ఏఐ సిటీని నిర్మించాలని రేవంత్ ఇప్పటికే నిర్ణయించారు. అలగే వరల్డ్ ట్రేడ్ సెంటర్ ను ప్రతిపాదిస్తున్నారు. ఇప్పటికే వరల్డ్ ట్రేడ్ సెంటర్ ప్రతినిధులతో ఒప్పందం జరిగింది. వరల్డ్ ట్రేడ్ సెంటర్కు అనువైన ప్రాంతాన్ని ఎంపిక చేసే కసరత్తు చేస్తున్నారు. ఏఐ సిటీకి ప్రతిపాదించిన స్థలం సమీపంలో మూడు ప్రాంతాల్ని ఎంపిక చేశారు. వాటికి సంబంధించి పూర్తి సానుకూలతలు, అననుకూలతల నివేదికలను సమర్పించనున్నారు. ఎయిర్ పోర్ట్, మెట్రోరైల్ స్టేషన్లకు వేగంగా చేరుకునేందుకు వీలుగా ప్రధాన రోడ్డుతో పాటు, ఇంటర్నల్ రోడ్లు వరల్డ్ ట్రేడ్ సెంటర్కు అనుసంధానమై ఉండేలా మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం అంగీకరించింది. మొత్తంగా 70 ఎకరాల స్థలంలో వరల్డ్ ట్రేడ్ సెంటర్ను నిర్మించే అవకాశం ఉంది. సోలార్ పవర్ ప్లాంట్తో పాటు, కమ్యూనికేషన్ వ్యవస్థ కోసం భారీ టవర్లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇలా అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని ఫ్యూచర్ సిటీలోనే భూమిని త్వరలోనే ప్రభుత్వం ఖరారు చేయనుంది.

### మహానగరం విస్తృతమైన ట్రాన్స్ పోర్ట్ ట్వర్క్..

ఫ్యూచర్ సిటీ జోన్లు.. వివిధ రంగాలకు కేటాయించే భూములపై ఇప్పుడిప్పుడే క్లారిటీ వస్తోంది. మరి ఈ నెట్ జీరో సిటీకి హైదరాబాద్ నుంచి చేరుకోవాలంటే.. ట్రాన్స్పోర్ట్ కూడా చాలా ముఖ్యమే. హైదరాబాద్ శివార్లలో శ్రీశైలం హైవేపై ఏర్పాటు అవబోతున్న ఈ సిటీకి నిమిషాల్లో చేరుకోవాలంటే విస్తృతమైన ట్రాన్స్ పోర్ట్ నెట్ వర్క్ కూడా అవసరమే. దీనిపై సీఎం రేవంత్ చాలా సార్లు ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించి సమాలోచన జరిపారు. ఎయిర్ పోర్టు నుంచి, ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) నుంచి, అలాగే త్వరలో నిర్మితమయ్యే రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) నుంచి ఎలా చేరుకోవడం, అలైన్ మెంట్లపైనా భారీగానే కసరత్తు జరుగుతోంది. హైదరాబాద్ నగరం వివిధ ప్రాంతాల నుంచి ముఖ్యంగా శంషాబాద్ ఎయిర్ పోర్ట్, ఔటర్ రింగ్ రోడ్, ప్రతిపాదిత రీజినల్ రింగ్ రోడ్ నుంచి ఫ్యూచర్ సిటీకి రోడ్డు, మౌలిక సదుపాయాలు, మెట్రో రైలు కనెక్టివిటీ కల్పించడంపై సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే వివిధ శాఖలతో వరుస సమావేశాలు నిర్వహించారు. ఇందుకు సంబంధించి తన ఆలోబచనల మేరకు మార్గదర్శకాలు కూడా ఇచ్చారు. ఫ్యూచర్ సిటీకి 16 రేడియల్.. రోడ్లు నిర్మించాలని ఇప్పటికే రూట్ మ్యాప్ ఇచ్చారు.



### విదేశీ పర్యటనల అనుభవాలు, అధ్యయనాల సమాహారం..

రేవంత్ సర్కారు ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన 'భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శరవేగంగా పావులు కదుపుతున్నారు. హైదరాబాద్ మహానగర అభివృద్ధిపై తాను ఇప్పటికే పూర్తిచేసిన విదేశీ పర్యటనలు, అధ్యయనాలు, అనుభవాలను నేపథ్యంలో తాజాగా అధికార యంత్రాంగానికి మార్గనిర్దేశం చేశారు. అధికారికంగా ప్రకటించకపోయినా.. దేశంలో రెండో రాజధాని స్థాయిలో అభివృద్ధి వైపు దూసుకుపోతున్న హైదరాబాద్ మహానగరం ఘనతను ప్రపంచస్థాయిలో దాటాలన్న లక్ష్యంతో రేవంత్ రెడ్డి సర్కారు ముందుకు సాగుతోంది. ఇంటర్నేషనల్ ఎయిర్పోర్టు ఉన్న ప్రాంతం చుట్టూ ముచ్చెర్ల, బేగరికం తదితర గ్రామాలను కలుపుతూ తలపెట్టిన ఫ్యూచర్ అభివృద్ధి కార్యాచరణలో లివింగ్ సిటీలు కూడా ఏర్పాటు చేయాలన్న మరో కొత్త ఆలోచనతో సీఎం రేవంత్ రెడ్డి కసరత్తు దాదాపు పూర్తయింది. ఆ దిశగా ప్రతిపాధనలు రూపొందించాలని ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ (ఎప్సీడీఏ) అధికారులకు మార్గనిర్దేశం చేశారు. తాజాగా జపాన్ పర్యటన ముగించుకుని వచ్చిన తర్వాత పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన సీఎం తన ఆలోచనలను, విదేశీ పర్యటనల అధ్యయన సారాంశాన్ని వారికి వివరించారు. ఆ మేరకు ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, ఫార్మా సిటీ.. ఇలా విభిన్న రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు..

### మెట్రో విస్తరణకు ఐదు కొత్త కారిడార్లు..

మెట్రో రైలు ప్రతిపాదిత రెండో దశ 78 కిలోమీటర్లతో ఐదు కారిడార్లు రానున్నాయి. ఇందులో శంషాబాద్ ఎయిర్పోర్టు హైదరాబాద్ సిటీలోని మెట్రో లైన్లతో లింకప్ కానున్నాయి. అటు ఎయిర్పోర్టు నుంచి ఫ్యూచరిసిటీకి మెట్రో రైలు రూట్ ఆప్షన్లను అధికారులు కొద్దిరోజుల క్రితం రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చారు. శంషాబాద్ ఎయిర్పోర్టు నుంచి రావిర్యాల మీదుగా ఒకటి, తుక్కుగూడ మీదుగా శ్రీశైలం మార్గంలో మరోటి రెండేసి ఆప్షన్లు రూపొందించారు. ఆప్షన్ 1లో భాగంగా ఎయిర్ పోర్ట్ నుంచి స్కిల్ వర్శిటీ దాకా దూరం 32 కిలోమీటర్లు ఉంటే.. స్టేషన్ల సంఖ్య 12 ఉంటాయని, నిర్మాణానికి 6173 కోట్లు అవసరమవుతాయని అంచనాలు ఇచ్చారు. ఆప్షన్ 2లో భాగంగా ఎయిర్ పోర్ట్ నుంచి స్కిల్ వర్శిటీ వయా రావిర్యాల మీదుగా అయితే 32 కిలోమీటర్లు ఉండగా. 10 స్టేషన్లు, నిర్మాణ వ్యయం 5216 కోట్లు అవుతాయని లెక్కలేశారు. ఆప్షన్ 3లో భాగంగా ఎయిర్ పోర్ట్ నుంచి వయా శ్రీశైలం రోడ్డు ద్వారా 32 కిలోమీటర్లు ఉండగా, 12 స్టేషన్లు, 3256 కోట్లు అవసరమవుతాయని లెక్కేశారు. 2028 నుంచి 2053 వరకు ప్రయాణికుల సంఖ్య కూడా ఎంత ఉంటుందో అంచనాలు వేసి అంతా పకడ్బందీగా ప్రణాళికలు సిద్ధం చేశారు.




1. ఫార్మా సిటీ
2. ఏఐ సిటీ
3. ఫిల్మ్ సిటీ
4. సోలార్ సిటీ
5. లివింగ్ సిటీ
6. ఎంటర్టైన్మెంట్ సిటీ





## నోట్‌బుక్స్ పంపిణీ

**బూర్గంపాడు, మహా :** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని, వారి విద్యాభివృద్ధికి అవసరమైన సహకారం అందించేందుకు గ్రామ పంచాయతీ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఇరవెండి గ్రామ సర్పంచ్ గుండి బాబురావు పేర్కొన్నారు.మండలంలోని ఇరవెండి గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఎంపీయూపీఎస్ పాఠశాలలో గురువారం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గుండి బాబురావు, ఉప సర్పంచ్ మహంకాళి రామారావు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుండి బాబురావు మాట్లాడుతూ, విద్యార్థులు విద్యనే ఆయుధంగా చేసుకుని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. పాఠశాల స్థాయి నుంచే క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుంటే జీవితంలో విజయాలు సాధించడం సులభమవుతుందని చెప్పారు.

# సిండికేట్ ల అడ్డాగా మద్యం దళారులు..

- **సిండికేట్ లో సూత్రదారెవరు..?**
- **చట్టాలకే సవాల్ గా మారిన సిండికేట్ దందా..**




**దమ్మపేట ,మహా :** మండలంలో మద్యం సిండికేట్ దందా మూడు పువ్వులు ఆరు కాయలతో .... కాదు మొరటు సామెత అది. తాజాగా ఆ సామెత ను మార్చి మూడు లైసెన్సులు ఆరు బెల్టులు అన్నట్లుగా ఇక్కడి సిండికేట్ దందా కొనసాగుతుంది. దండుకున్న వారికి దండుకున్నంత అనే నానుడి ఇక్కడి రాజకీయ నాయకుల నుండి అతి సామాన్య కుల సంఘాల వారికి , ఇతరత్రా జేబు దళారులకు మూలనిధి లా సిండికేట్ ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి.సందడిలో సడేమియాలాగా మధ్యలో ఉన్న వ్యక్తులు కొంతమేరకు దోచుకుంటున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.ప్రభుత్వం మద్యం విక్రయాలపై కఠిన నిబంధనలు అమలు చేస్తున్నామని ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం అక్రమ మద్యం సిండికేట్ ల దందా నిరాటంకంగా కొనసాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామాలు, శివారు ప్రాంతాలు, ప్రధాన రహదారుల వెంట గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న ఈ వ్యాపారం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయనే ప్రశ్నలు ప్రజల్లో తలెత్తుతున్నాయి.

**సిండికేట్‌ల వలలో గ్రామాలు :**
స్థానికుల కథనం ప్రకారం, కొందరు వ్యక్తులు సమన్వయంతో పనిచేస్తూ ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నారని ఆరోపణలు ఉన్నాయి. మద్యం నిల్వలు ఒకచోట, సరఫరా మరోచోట, విక్రయాలు ఇంకోచోట నిర్వహిస్తూ అధికారుల కళ్లుగప్పే ప్రయత్నాలు జరుగుతున్నాయనే విమర్శలు ఉన్నాయి. విచారణలో తేలాల్సి ఉన్నప్పటికీ, ఈ వ్యవహారం వెనుక పెద్ద స్థాయి సిండికేట్ పని చేస్తోందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**నిబంధనలు కాగితాలకే పరిమితమా?**
మద్యం విక్రయాలకు సంబంధించి స్పష్టమైన చట్టాలు, లైసెన్సింగ్ విధానాలు ఉన్నప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో అవి అమలవుతున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రజల ఫిర్యాదులు, స్థానికంగా వినిపిస్తున్న ఆరోపణల నేపథ్యంలో సంబంధిత శాఖలు మరింత కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**యువతే లక్ష్యమా?**
సులభంగా అందుబాటులోకి వస్తున్న అక్రమ మద్యం కారణంగా యువత వ్యసనాల బారిన పడుతోందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లోనూ అక్రమ విక్రయాలపై ఆరోపణలు వినిపిస్తుండటంతో తల్లిదండ్రుల్లో ఆందోళన పెరుగుతోంది. ఆరోపణల నిజానిజాలు అధికారికంగా నిర్ధారణ కావాల్సి ఉన్నప్పటికీ, ఈ అంశంపై పర్యవేక్షణ పెంచాలనే డిమాండ్ బలపడుతోంది.

**ప్రభుత్వ ఆదాయానికి గండి.:**
అక్రమ మద్యం వ్యాపారం కారణంగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం దెబ్బతింటోందని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లైసెన్స్ ఫీజులు, పన్నులు చెల్లించే చట్టబద్ధ వ్యాపారులపై కూడా దీని ప్రభావం పడుతుందని వారు పేర్కొంటున్నారు.

**అసలు సూత్రధారులు ఎవరు?:**
స్థానిక స్థాయిలో పట్టుబడేది చిన్నచిన్న నిర్వాహకులే కానీ, ఈ వ్యవస్థ వెనుక ఉన్న అసలు సూత్రధారులు ఎవరు అనే ప్రశ్నకు సమాధానం దొరకడం లేదనే విమర్శలు ఉన్నాయి. విచారణ సంస్థలు ఈ కోణంపై దృష్టి సారిస్తేనే పూర్తి వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారుఅక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఉన్నప్పటికీ ఎందుకు పూర్తి స్థాయిలో అరికట్టలేకపోతున్నారు?ఈ దందా వెనుక వ్యవస్థీకృత నెట్‌వర్క్ ఉందా?ఫిర్యాదులపై సంబంధిత శాఖలు తీసుకున్న చర్యలు ఏమిటి?చట్ట ఉల్లంఘనలకు పాల్పడుతున్న వారిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?అనే ప్రశ్నలు ప్రజలను బాదిస్తున్నాయి.
అక్రమ మద్యం వ్యాపారంపై వినిపిస్తున్న ఆరోపణలు ప్రజలలో ఆందోళనకు కారణమవుతున్నాయి. ఈ ఆరోపణలపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టి, వాస్తవాలను ప్రజల ముందుంచాల్సిన అవసరం ఉందని సామాజిక వర్గాలు కోరుతున్నాయి. చట్ట అమలులో పారదర్శకత, నిరంతర పర్యవేక్షణ, తప్పిదాలు చేసిన వారిపై కఠిన చర్యల ద్వారానే ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టగలమని వారు అభిప్రాయపడుతున్నారు..



## జవహర్‌నగర్‌లో అక్రమ మద్యం పట్టివేత

**ఎక్సైజ్ దాడుల్లో 257 లీటర్ల మద్యం స్వాధీనం**

**కుషాయిగూడ, మహా:** జవహర్‌నగర్ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచి విక్రయిస్తున్న గోవా మద్యం, విదేశీ మద్యాన్ని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డైరెక్టర్ ఆదేశాలు, ఏసీఆర్ఆర్ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా మల్కాజిగిరి డిప్యూటీ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ పర్యవేక్షణలో డీటీఎఫ్ మల్కాజిగిరి, కాప్రా ఎస్‌హెచ్‌వో బృందాలు జవహర్‌నగర్ ప్రాంతంలో దాడులు నిర్వహించాయి. బాలాజీనగర్‌లోని వెంకటేశ్వర కాలనీలో ఓ ఇంటిపై నిర్వహించిన తనిఖీల్లో 59 సీసాల గోవా, విదేశీ మద్యం లభ్యమైంది. మొత్తం 51.55 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకుని రెడ్డి శెట్టి మహేష్‌పై కేసు నమోదు చేశారు. అదే ప్రాంతంలోని మోహన్‌రావు కాలనీలో మరో ఇంటిపై నిర్వహించిన దాడిలో 112 సీసాల గోవా, విదేశీ మద్యం, 251 సీసాల డ్యూటీ పేడ్ విస్కీ స్వాధీనం చేసుకున్నారు. వీటి పరిమాణం 205.41 లీటర్లుగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేసులో రెడ్డి శెట్టి శ్రీనివాస్‌పై కేసు నమోదు చేశారు. రెండు కేసుల్లో కలిపి 422 సీసాల మద్యం, 256.96 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసులు నమోదు చేసి, చట్టపరమైన ప్రక్రియ అనంతరం బెయిల్‌పై విడుదల చేసినట్లు తెలిపారు

## ఆదిభట్లలో నల్ల బిల్లు మాఫీ చేయాలని ఎమ్మెల్యేను కోరిన గ్రామ ప్రజలు

- **సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే**



**ఇబ్రహీంపట్నం జూన్ 18 మహా:** ఆదిభట్ల గ్రామానికి చెందిన ప్రజలు, ఎమ్మెల్యే రంగారెడ్డిని కలిసి, నల్ల బిల్లు మాఫీ చేయాలంటూ కోరారు. రంగారెడ్డి జిల్లా జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ ఆదిభట్ల గ్రామంలో నల్ల బిల్లులు మాఫీ చేయాలంటూ గురువారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిని, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈసీ శేఖర్ మామ, పిఏసిఎస్ చైర్మన్లు ఏదుళ్ళ పాండురంగ రెడ్డి, జమ్మ శ్రీశైలం, డైరెక్టర్ పల్లె శ్రీకాంత్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ ఆదిభట్ల డివిజన్ అధ్యక్షులు పల్లె రజనీకాంత్ గౌడ్, పల్లె శ్రీనివాస్ గౌడ్ కలిసి కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఆదిభట్ల ప్రజల యొక్క సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా పల్లె సాయిబాబా గౌడ్, పెద్ద శీనన్న, గజ్జల నరసింహ, కోరి నరసింహ, కోరి అయిలయ్య, గజ్జల బాబు, పల్లె వెంకటేష్, జమ్మ రాజు, భూపతిగల్ల అశోక్ పాల్గొన్నారు.

## 'డయల్ యువర్ ఉప్పల్ ఎమ్మెల్యే'కు విశేష స్పందన

- **ప్రజా సమస్యల పరిష్కారానికి డయల్ యువర్ బండారు లక్ష్మారెడ్డి వెల్లడి**



**కుషాయిగూడ, మహా :** ఉప్పల్ నియోజకవర్గ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే ఉద్దేశంతో వే టు న్యూస్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'డయల్ యువర్ ఉప్పల్ ఎమ్మెల్యే' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రజల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌ను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలు, బస్తీలు, డివిజన్లలో నెలకొన్న తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రోడ్లు, వీధిదీపాలు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అందిన ప్రతి ఫిర్యాదును నమోదు చేసి సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధి వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు సమస్యల పరిష్కారంలో వేగం పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# నక్షసర్వేపై కలెక్టర్ అంకిత్ తనిఖీ

- **మణుగూరులో భూ రికార్డుల నమోదు పరిశీలన..**
- **వరద ముంపు ప్రాంతాల సందర్శన..**
- **వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం మణుగూరు ఏరియాలో విస్తృతంగా పర్యటించారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన నక్ష భూరీసర్వే కార్యక్రమం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అదే సమయంలో వర్షాకాలం ముందస్తు చర్యల్లో భాగంగా గోదావరి వరదల ప్రభావానికి గురయ్యే ముంపు ప్రాంతాలను సందర్శించి అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**భూ రికార్డుల నమోదు ఖచ్చితంగా చేయాలి..**
మణుగూరు మండలం కొమ్ముగూడెం ప్రాంతంలో మున్సిపల్ సిబ్బంది నిర్వహిస్తున్న ఆర్.ఓ.ఆర్ (రికార్డ్ ఆఫ్ రైట్స్) నమోదు ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రతి ఎంట్రీ నమోదు చేయడానికి పడుతున్న సమయం, నమోదు విధానం, ప్రజల నుంచి సేకరిస్తున్న వివరాలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. భూములకు సంబంధించిన వివరాలను అత్యంత ఖచ్చితత్వంతో నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. నక్ష పైలట్ ప్రాజెక్ట్ ద్వారా భూ రికార్డుల్లో పారదర్శకత పెరిగి ప్రజలకు భూ సంబంధిత సేవలు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. నిర్ణీత గడువులో సర్వే, నమోదు ప్రక్రియలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**గోదావరి ముంపు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి**
అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ అడిషనల్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ఠతో కలిసి మణుగూరు మండలం అన్నారం, కమలాపురం గ్రామాల్లో గోదావరి వరదల ప్రభావానికి గురయ్యే కోడిపుంజుల వాగు బ్రిడ్జి పరిసర ప్రాంతాలను పరిశీలించారు. గోదావరి నీటిమట్టం పెరిగిన సమయంలో ఎదురు నీరు ప్రవహించడం వల్ల ఏర్పడే ముంపు పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. వరదల సమయంలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలు, ప్రజల తరలింపు, పునరావాస కేంద్రాల ఏర్పాటు, తాగునీరు, విద్యుత్, వైద్య సేవలు తదితర అత్యవసర సదుపాయాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ప్రాణ, ఆస్తుల రక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలి..**
ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ వరద ప్రభావిత ప్రాంతాలను ముందుగానే గుర్తించి అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని, వాతావరణ హెచ్చరికలు, నీటిమట్టాల వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తూ అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. ఒకవైపు భూ రికార్డుల సంస్కరణలు... మరోవైపు వరద సన్నద్ధతపై సమీక్ష నిర్వహిస్తూ మణుగూరులో జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని కలెక్టర్ అంకిత్ స్పష్టం చేశారు. ఈ పర్యటనలో మణుగూరు మున్సిపల్ కమిషనర్ ప్రసాదరావు, తహసీల్దార్ అద్దంకి నరేష్, ఇంచార్జ్ ఎంపీడీవో పల్నాటి వెంకటేశ్వర్లు, మున్సిపల్ శాఖ సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు జిల్లా కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

### లోతట్టు ప్రాంతాల్లో డ్రైనేజీలపై తనిఖీ..

మణుగూరులోని సింగరేణి పికెఓసి ఓపెన్‌కాస్ట్ గనుల ప్రాంతం నుంచి విడుదలయ్యే నీటి ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలను కలెక్టర్ పరిశీలించారు. గాంధీనగర్ నుంచి సుందరయ్య నగర్, కాళీమాత ఆలయ పరిసరాలు, వినాయక నగర్ ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థ పనితీరును తనిఖీ చేసి డ్రైనేజీల్లో పూడిక, చెత్త పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచే చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వర్షపు నీరు వేగంగా వెళ్లేలా కాలువలను సిద్ధం చేయాలని, లోతట్టు ప్రాంత ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



## ఎల్‌నినో ముప్పుపై ప్రభుత్వం అప్రమత్తం కావాలి

**ప్రభుత్వానికి దేవి ప్రసాద్ సూచన**

**కుషాయిగూడ మహా :** ఖరీఫ్ సీజన్‌లో ఎల్‌నినో ప్రభావం తెలంగాణపై తీవ్రంగా పడే అవకాశమున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని కార్పొరేషన్ మాజీ చైర్మన్ జి. దేవీప్రసాద్ డిమాండ్ చేశారు ఈ మేరకు గురువారం దేవి ప్రసాద్ పత్రిక ప్రకటనను విడుదల చేశారు. కేంద్రం విడుదల చేసిన హెచ్చరికలు, వాతావరణ నిపుణుల అంచనాల ప్రకారం రాష్ట్రంలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొనే ప్రమాదం ఉందన్నారు. దక్షిణ, ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వర్షపాతం లోటు నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులకు ముందస్తు సూచనలు జారీ చేయడంతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. అధిక నీటి అవసరమున్న వరి సాగుపై శాస్త్రీయ ప్రణాళికతో ముందుకెళ్లాలని, ప్రత్యామ్నాయ పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వాలన్నారు. కృష్ణా, గోదావరి పరివాహక ప్రాంతాల్లో వర్షాభావం కొనసాగితే శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల వంటి ప్రధాన జలాశయాలకు నీటి ప్రవాహాలు తగ్గే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించిన మరమ్మతులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, అనుసంధానిత రిజర్వాయర్లు, చెరువులను నింపే వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుబంధు, పంటల కొనుగోలు, పంట బీమా, వ్యవసాయ ఇన్‌పుట్ల సరఫరా, తాగునీటి భద్రత అంశాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించి రైతాంగానికి భరోసా కల్పించాలని దేవీప్రసాద్ విజ్ఞప్తి చేశారు. రైతు సంక్షేమమే తెలంగాణ అభివృద్ధికి పునాదని, రైతాంగాన్ని కాపాడటం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని పేర్కొన్నారు.





## మన పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు

- **స్ఫూర్తిని కొనసాగిద్దాం... భవితకు బంగారుబాటలు వేద్దాం**
- **ఆరుట్లలో సీఎం పర్యటన విజయవంతంపై ఎమ్మెల్యే మల్ రెడ్డి అభినందనలు**
- **ప్రభుత్వ సంకల్పానికి తల్లిదండ్రులు అండగా నిలువాలి**
- **అభివృద్ధి నిరోధకుల గురించి పట్టించుకోవద్దని సూచన**

**ఇబ్రహీంపట్నం జూన్ 18 మహా:** ఆరుట్లలో అంతర్జాతీయ స్థాయిలో నిర్మించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తిని ఇకపై కూడా కొనసాగిస్తూ.... మన పిల్లల భవిష్యత్తుకు బంగారుబాటలు వేద్దామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి తెలిపారు. సీఎం చొరవతో యుద్ధప్రాతిపదికన స్కూల్ నిర్మాణం పూర్తయిందని.... ఇదే స్ఫూర్తితో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని చెప్పారు. స్కూల్ నిర్వహణ, భోధన, పిల్లలకు సదుపాయాలు, ఉత్తమ ఫలితాల విషయంలో ఎక్కడా తగ్గకుండా పాఠశాలను ఆదర్శంగా నిలపాలని చెప్పారు. ముఖ్యమంత్రి పర్యటన విజయవంతంపై ఎమ్మెల్యే మల్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. విద్యాకమిషన్ ఛైర్మన్, సభ్యులకు, ప్రభుత్వ యంత్రాంగానికి, ప్రజాప్రతినిధులకు, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీకి ఆయన అభినందనలు తెలిపారు. రంగారెడ్డి జిల్లాలో మారుమూల ప్రాంతంలో ఉన్న ఆరుట్లకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు వచ్చిందని, సీఎం పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన అవసరముందన్నారు. విద్యార్థులే ఆస్తిగా ప్రజాప్రభుత్వం భావిస్తూ.... విద్య, క్రీడలు, స్కిల్స్, ఇలా అన్ని విషయాల్లో వారిని ప్రోత్సహించేందుకు ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ప్రభుత్వ సంకల్పానికి తల్లిదండ్రులంతా అండగా నిలవాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కోరారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధిని చూసి కడుపు మంటతో అభివృద్ధి నిరోధకులు లేనిపోని మాటలు మాట్లాడుతున్నారని, అలాంటి వారిని పట్టించుకోవాల్సిన అవసరంలేదని ప్రజలకు ఎమ్మెల్యే సూచించారు. గొప్ప సంకల్పంతో పిల్లల భవిష్యత్తు కోసం నిర్మించిన స్కూల్ నిర్మాణంపై కూడా వారు చేస్తున్న ఆరోపణలు వారి కుళ్లు రాజకీయాలకు నిదర్శనంగా మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు.

# ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా సేవాకార్యక్రమాలు అభినందనీయం: ఎమ్మెల్యే

- **సమాజ శ్రేయస్సు కోసం జీవించే వారే నిజమైన ధన్యులు...**
- **విద్యాభివృద్ధికి రేవంత్ సర్కార్ ప్రత్యేక దృష్టి**
- **ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి.**
- **ఇంజాపూర్ జడ్పీహెచ్ఎస్ లో సరస్వతీమాత విగ్రహాని ఆవిష్కరించిన ఎమ్మెల్యే**




**ఇబ్రహీంపట్నం జూన్ 18 మహా:** సమాజ శ్రేయస్సు కోసం జీవించే వారు నిజమైన ధన్యజీవులను ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. ఇంజాపూర్ కు చెందిన బొక్క భూపాల్ రెడ్డి అనే వ్యక్తి... తన 83వ జన్మదినాన్ని పురస్కరించుకుని, స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో చదువుల తల్లి సరస్వతీమాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే... భూపాల్ రెడ్డి పాఠశాలకిచ్చిన యూనిఫాం, పుస్తకాలు, ప్లేట్లు, ఇతర వస్తువులను విద్యార్థులకు అందజేశారు. భూపాల్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మల్ రెడ్డి... నిండునూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించి, మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. పిల్లల భవిష్యత్ కోసం భూపాల్ రెడ్డి ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా సేవా కార్యక్రమాలు నిర్వహించటం పట్ల మల్ రెడ్డి రంగారెడ్డి అభినందనలు తెలిపారు. సమాజంలో సేవా దృక్పథం మరింత పెరగాల్సిన అవసరం ఉందన్నారు. తమకున్నదానిలో కొంత ఇతరులకు పంచినప్పుడే ఉన్నతమైన సమాజం నిర్మితమవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం విద్య కోసం ప్రత్యేక దృష్టి సారించిందన్న ఎమ్మెల్యే.... సరికొత్త విధానాలతో భవిష్యత్తుకు బంగారుబాటలలు వేస్తున్నట్లు చెప్పారు. భూపాల్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుని మరికొంత మంది దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మెన్ మల్ రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు ముద్దగోని రామ్మోహన్ గౌడ్, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికుల సమస్యల పై సీఎం కు వినతిపత్రం అందజేసిన మంత్రి



వరంగల్, మహా బ్యూరో: చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించాలని కోరుతూ రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలోని 50కు పైగా చేనేత సహకార సంఘాలకు చెందిన సుమారు 5 వేల మంది కార్మికుల ఉపాధి పరిరక్షణ కోసం ఈ విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. బెడ్‌షీట్లు, కార్పెట్లు, యూనిఫాంల సరఫరాపై ఆధారపడిన చేనేత కుటుంబాల జీవనోపాధిని కాపాడేందుకు ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సీఎం సమస్య పరిష్కారానికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు చేనేత నాయకులు తెలిపారు.

# గోదావరి ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

- **అనధికారిక ఇసుక నిల్వలు, ర్యాంపులపై కఠిన చర్యలు**
- **అధికారిక సొసైటీ ర్యాంపుల నుంచే ఇసుక సరఫరా జరగాలి: సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట**



**బూర్గంపహాడ్, మహా** : అధికారికంగా సొసైటీ సభ్యులు నిర్వహిస్తున్న ఇసుక ర్యాంపుల నుంచే ఇసుక సరఫరా జరగాలని, అనుమతులు లేకుండా గోదావరి ఇసుకను తరలించడం, అక్రమంగా ఇసుక నిల్వలు ఏర్పాటు చేయడం, అనధికారిక ర్యాంపులు నిర్వహించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట హెచ్చరించారు.గురువారం ఉదయం బూర్గంపహాడ్ మండలం లోని సారపాక పరిధిలోని తాళ్లగొమ్మూరు గోదావరి పరిసర ప్రాంతాల్లో ఉన్న ఇసుక నిల్వలను సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పోలీసు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.సోంపల్లి అధికారిక ఇసుక ర్యాంపుల నుంచి అక్రమంగా ఇసుక తరలింపు జరుగుతోందని, అలాగే అనుమతులు లేకుండా ఇసుకను నిల్వ చేస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. సొసైటీ సభ్యులు నిర్వహించే అధికారిక ర్యాంపుల నుంచే ఇసుక సరఫరా జరగాలని స్పష్టం చేశారు.అక్రమ ఇసుక రవాణాను అరికట్టేందుకు గోదావరి పరిసర ప్రాంతాల్లో కంచెలు, కందకాలు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. అలాగే గోదావరి కరకట్ట ప్రాంతాల్లో 24 గంటల నిఘా ఏర్పాటు చేసి, ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అడ్డుకోవాలని సూచించారు.అనుమతులు లేకుండా ఇసుక తరలించే వ్యక్తులు, వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, వాహనాలను సీజ్ చేసి బాధ్యులను అదుపులోకి తీసుకోవాలని పోలీసు, రెవెన్యూ అధికారులకు సూచించారు.భవిష్యత్తులో కూడా ఎప్పటికప్పుడు ఇసుక ర్యాంపులపై ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తానని సబ్ కలెక్టర్ తెలిపారు. అధికారిక ర్యాంపులను నిర్వహిస్తున్న సొసైటీ సభ్యులు నిబంధనలు పాటిస్తూ పారదర్శకంగా, నిజాయితీగా కార్యకలాపాలు నిర్వహించాలని సూచించారు.ఈ తనిఖీ కార్యక్రమంలో డీటీ సమ్మయ్య, పోలీసు సిబ్బంది, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా 75వ వన మహోత్సవం..

- **భవిష్యత్ తరాల కోసం ఒక మొక్క నాటాలి..**
- **పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి..**
- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు**



**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని రథంగుట్ట హనుమాన్ టెంపుల్ పరిసర ప్రాంతంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో చెట్లు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందన్నారు. మొక్కలు నాటడం ఒక మంచి కార్యక్రమమే అయినప్పటికీ, వాటిని పెంచి పెద్ద చెట్లుగా మార్చడం సమాజం మొత్తం బాధ్యతగా భావించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న తెలంగాణ హరితహారం, వన మహోత్సవం వంటి కార్యక్రమాలను ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. చెట్ల పెంపకం ద్వారా వర్షపాతం పెరగడంతో పాటు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించి ప్రకృతిని పరిరక్షించవచ్చని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, మొక్కలు నాటి సంరక్షించడం ద్వారా సమాజానికి మేలు జరుగుతుందని పేర్కొన్నారు. చెట్లను కాపాడితేనే భవిష్యత్ తరాలకు భద్రమైన జీవనం సాధ్యం అని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం ప్రత్యేకంగా పేర్కొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన అటవీ శాఖ అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని కమలాపురం గ్రామంలో రూ.60 లక్షల నిధులతో నిర్మిస్తున్న సైడ్ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యతతో కూడిన నిర్మాణాలు చేపట్టాలని, నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్ కు సూచించారు. కార్యక్రమాల్లో మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, జిల్లా ముఖ్య నాయకులు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ప్రయివేటుతో పోటి పడుతున్న భీక్యాతండా పాఠశాల

- **విద్యార్థులకు డైరీల పంపిణి**

**కారేపల్లి, మహా** : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదు పడిపోతున్న తరుణంలో కారేపల్లి మండలం బీక్యతండా పాఠశాలలో పిల్లల నమోదు పెరుగుతూ వస్తుంది. ఉపాధ్యాయుల పట్టుదల, పిల్లల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాల పై ఉన్న నమ్మకం తో భీక్యాతండా పాఠశాల క్రమశిక్షణ, అభ్యస పక్రియలలో చూపుతున్న వినూత్న ఒరవడితో ఆదర్శంగా నిలుస్తుంది. అంగ్ల మాధ్యంలో భోధన చేస్తూ దేనిలోను ప్రయివేటుకు తీసిపోదని నిరుపిస్తుంది. ప్రయివేటు పాఠశాలలో విద్యారుల ప్రగతి , తల్లిదండ్రులకు సూచనలు ఇవ్వటానికి ఇచ్చే డైరీ లకు పైకం వసూళ్లు చేస్తుండగా భీక్యతండా పాఠశాలలో గురువారం ఉచితంగా విద్యార్థులకు డైరీలు ఇచ్చి విద్యార్థుల మొహంలో అనందాన్ని నింపారు. ఈసందర్భంగా సర్పంచ్ దండు ప్రవీణ్ ఆధ్వర్యంలో విద్యార్థుల చేత అక్షరాభ్యసం చేయించటం, చిన్నారులను ఆశీర్వదించే కార్యక్రమాన్ని చేపట్టారు. సర్పంచ్ తన బాధ్యతగా పాఠశాలకు రంగులు వేయించి ఉపాధ్యాయులను పోత్సహిస్తున్నారు. సర్పంచ్ దండు ప్రవీణ్, కార్యదర్శి కృష్ణవేణి లతో పాటు గ్రామస్తుల సహకారం తో పాఠశాలలోని విద్యారులను ఉన్నతంగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నట్లు హెచ్ఎం వనజా రాణి తెలిపారు. పిల్లల ఉన్నత స్థితిలో ఉంటే కలిగే అనందాన్ని మునుముందు చూడాలనే ఆకాంక్షను వెలిబుచ్చారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయురాలు శోభారాణి, వార్డు సభ్యులు అజ్మీర మమత, రాజేశ్, విజయ తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరులో భవిత భవనం ప్రారంభం..

- **దివ్యాంగులకు మెరుగైన సేవలే లక్ష్యం**
- **లబ్ధిదారునికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత..**
- **సంక్షేమ.. అభివృద్ధి కార్యక్రమాల్లో**
- **ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు..**



**మణుగూరు, మహా** : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక నియోజకవర్గం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మణుగూరు మండలంలో గురువారం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎండిఓ కార్యాలయ ఆవరణలో రూ.3 లక్షల వ్యయంతో పునర్నిర్మించిన భవిత భవనంను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఉప్పుసాక గ్రామానికి చెందిన లబ్ధిదారునికి ముఖ్య మంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు.

**దివ్యాంగులకు మెరుగైన సేవలే లక్ష్యం**

మణుగూరు మండల కేంద్రంలోని ఎండిఓ కార్యాలయ ప్రాంగణంలో పునర్నిర్మించిన భవిత భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం పాల్గొని భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు వారి కుటుంబాలకు నాణ్యమైన సేవలు అందించడంలో భవిత కేంద్రాలు కీలకంగా వ్యవహరిస్తాయని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరచడంలో ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. భవనం పునర్నిర్మాణంతో సేవల నాణ్యత పెరిగి లబ్ధిదారులకు మరింత అనుకూల వాతావరణం కల్పించబడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

**ఉప్పుసాక లబ్ధిదారునికి రూ.44 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు**

మణుగూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బూర్గంపాడు మండలం ఉప్పుసాక గ్రామానికి చెందిన రెంటాల వీరస్వామికి మంజూరైన రూ.44 వేల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆపద సమయంలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ గొప్ప అండగా నిలుస్తోందన్నారు. వైద్య చికిత్సల కోసం ఈ పథకం ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి కొనసాగుతోందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఎంఆర్వో అద్దంకి నరేష్, ఇంచార్జ్ ఎంపీడీవో, ఎంపిఓ పల్నాటి వెంకటేశ్వర్లు, ఎంఈఓ స్వర్ణజ్యోతి, ఐఈఆర్పీలు నాగశ్రీ, వీరు నాయక్, మండల అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మైనారిటీ అధ్యక్షులు రహీం, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచు కలబోయిన మాధవరావు, ఉపసర్పంచు గాండ్ల సురేష్, వార్డు సభ్యులు, మహిళా నాయకులు, పార్టీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో మహిళలకు పెద్దపీట

**మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్**

**మహిళా గ్రూపు సభ్యులకు చీరల పంపిణీ**

**మహా వరంగల్ బ్యూరో;**వరంగల్ నగరం 20వ డివిజన్ మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో కాశిబుగ్గ లోని నరేంద్ర నగర్ హైస్కూల్లో ఆర్పి లకు, మహిళా గ్రూపు సభ్యులకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గుండేటి నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూనే ప్రజా ప్రభుత్వం ద్వారా మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం మాజీ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ గ్రూపు సభ్యుల తో పాటు ఆర్పి లకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేశారు. గత ప్రభుత్వం పంపిణీ చేసిన చీరల కన్నా ఈ ప్రభుత్వం ఇచ్చే చీరలు ఎంతో నాణ్యతతో కూడిన మెరుగైనవిగా ఉన్నాయని మహిళా గ్రూపు సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తోట బాలరాజు, 20వ డివిజన్ ఆర్పీలు, డ్వాక్రా గ్రూప్ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ కార్మికుల రిలే దీక్షలు

**యాదాద్రి భువనగిరి, జూన్ 18 (మహా):** మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ భువనగిరి మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట గురువారం కార్మికులు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులను పర్మినెంట్ చేయడం, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయడం, రిటైర్మెంట్ ప్రయోజనాలు, హెల్త్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన మున్సిపల్ చైర్మన్ శ్రీవాణి రవికుమార్ కార్మికుల సమస్యలను తెలుసుకుని తమ పరిధిలోని అంశాలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

# న్యాయవాదులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి

**యాదాద్రి భువనగిరి, జూన్ 18 (మహా):** రాష్ట్రంలోని అన్ని నమోదు చేసుకున్న న్యాయవాదులకు మెడికల్ ఇన్సూరెన్స్ హెల్త్ కార్డులు జారీ చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (AILU) రాష్ట్ర ఉపాధ్యక్షుడు మామిడి వెంకట్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు జూన్ 20న హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నిర్వహించే ధర్నా కరపత్రాన్ని రామన్నపేట బార్ అసోసియేషన్ హాల్‌లో విడుదల చేశారు. 2019 తర్వాత నమోదు చేసుకున్న వేలాది మంది న్యాయవాదులు ఇప్పటికీ హెల్త్ కార్డుల ప్రయోజనాలకు దూరంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఆరోగ్య బీమా పరిమితి పెంపు, కుటుంబ సభ్యులను బీమా పరిధిలోకి తీసుకురావడం, అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్‌కు అదనపు నిధులు కేటాయించడం వంటి డిమాండ్ల సాధన కోసం న్యాయవాదులంతా జూన్ 20 ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# మణుగూరులో గంజాయి పట్టివేత..

- **80 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్ట్..**
- **స్కార్పియో వాహనం స్వాధీనం**
- **పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర ముఠా**

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండల పరిధిలోని తొగ్గుడెం ప్రాంతంలో పోలీసులు నిర్వహించిన వాహన తనిఖీల్లో భారీగా గంజాయి పట్టుబడింది. భద్రాచలం నుంచి ఒడిశా వైపు స్కార్పియో వాహనంలో అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రత్యేక తనిఖీల సందర్భంగా అనుమానాస్పదంగా వెళ్తున్న ఒక మహేంద్ర స్కార్పియో వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా అందులో సుమారు 80 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వెంటనే వాహనాన్ని స్వాధీనం చేసుకుని అందులో ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అరెస్టైన వారిని రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన సురేంద్ర సింగ్, ధర్మేంద్ర కుమార్ లుగా గుర్తించారు. వీరు భద్రాచలం ప్రాంతం నుంచి ఒడిశా రాష్ట్రానికి గంజాయిని తరలిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైందని తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలిస్తున్నట్లు మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి వెల్లడించారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టి తనిఖీలు ముమ్మరం చేశామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. సమావేశంలో సీఐ నాగబాబు, ఎస్సైలు నగేష్ కుమార్, రవుఫ్, హెడ్ కానిస్టేబుల్ దామోదర్, కానిస్టేబుల్ మురారి తదితరులు పాల్గొన్నారు.





# జర్నలిస్టుల హక్కుల పరిరక్షణకు దశలవారీ పోరాటం...

- **నల్ల బ్యాడ్జీలతో ధర్నా.. ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేత...**

**సత్తుపల్లి, జూన్ 18**: మహా: నియోజకవర్గ కేంద్ర ఆర్‌సీ ఇన్‌చార్జ్‌లకు మండల స్థాయి అక్రిడేషన్ కార్డులు, జిల్లా బస్సు పాసులు జారీ చేయడాన్ని నిరసిస్తూ యూనియన్లకు అతీతంగా సత్తుపల్లికి చెందిన జర్నలిస్టులు గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా నిర్వహించారు. జర్నలిస్టుల హక్కుల సాధన కోసం దశలవారీగా ఆందోళనలు చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌కు వినతిపత్రం అందజేసి, గతంలో అమలులో ఉన్న విధానంలోనే అక్రిడేషన్ కార్డులు, బస్సు పాసులు మంజూరు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ, ప్రభుత్వం నుంచి అందే శాశ్వత ప్రయోజనాలైన అక్రిడేషన్ కార్డులు, బస్సు పాసుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం సరైంది కాదని విమర్శించారు. బ్యూరోలు, డెస్క్ జర్నలిస్టులు, మండల విలేకరులను వేర్వేరుగా విభజించి, కార్డుల రంగుల్లోనూ తేడాలు చూపడం తగదన్నారు. జీవో నెం.252 జర్నలిస్టుల మధ్య చిచ్చు పెట్టిందని, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులను అనేక విధాలుగా విస్మరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తున్న జర్నలిస్టులను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. కొన్ని జర్నలిస్టు సంఘాలు కూడా ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తూ, క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న విలేకరులకు అన్యాయం చేస్తున్నాయని మండిపడ్డారు. జర్నలిస్టులకు లభిస్తున్న ఏకైక రాయితీ అయిన బస్సు పాసులను కూడా పూర్తిస్థాయిలో ఇవ్వకుండా నిరోధించడం సమంజసం కాదన్నారు. జర్నలిస్టుల హక్కుల పరిరక్షణలో ముందుండాల్సిన సంఘాలు ప్రశ్నించే ధైర్యం చూపకపోవడం సిగ్గుచేటని పేర్కొన్నారు. గత 15 నుంచి 20 ఏళ్లుగా అమలులో ఉన్న విధానాన్ని కొనసాగిస్తూ నియోజకవర్గ స్థాయిలో పనిచేస్తున్న పత్రికల ఆర్‌సీ ఇన్‌చార్జ్‌లకు గుర్తింపు కల్పించి, జిల్లా అక్రిడేషన్‌తో పాటు రాష్ట్ర స్థాయి బస్సు పాసులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు న్యాయం జరగని పక్షంలో హక్కుల కోసం మరింత ఉధృతంగా పోరాటం చేస్తామని, అవసరమైతే యూనియన్ల నుంచి వైదొలగడానికైనా వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు లు మాదిరాజు సుధాకర్, భీమిశెట్టి రాము, ఎండి షైబుద్దిన్, చీనేని బాలకృష్ణ, ఎస్కే ఖాదర్ బాబా, తోట కిరణ్, రామ్ శెట్టి లక్ష్మణరావు, తడికమల్ల దేవదానం, నిమ్మగడ్డ శ్రీకాంత్, రాజేష్ రెడ్డి, ఐ శ్రీను, ఆనంద్, జె శ్రీనివాస్, మోహన్, రామారావు, సురేష్, మెహరాజ్, సుధాకర్, గురవయ్య, రామకృష్ణ, గంగాధర్, రాంబాబు, అశోక్, చిరంజీవి, జగన్ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజన వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి : సిఐటియు డిమాండ్

**దమ్మపేట, జూన్ 18 మహా :** మధ్యాహ్నం భోజనం కార్మికులకు పనికి సరిపడు వేతనం అందించాలని సిఐటియు డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం పదివేల రూపాయలు వేతనం పెంచి అమలు చేయాలని, పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల మెనూ చార్జీలు 25 రూపాయలకు పెంచాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. గురువారం మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎంఈఓ జగపతికి పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ వంట కార్మికులు ప్రభుత్వ పాఠశాలలో గత 24 సంవత్సరాల నుండి పనిచేస్తున్నప్పటికీ ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా కనీస వేతనాలు ఇవ్వటం లేదని అన్నారు. ఇప్పటి మెనూ ను పాఠశాలలో విద్యార్థులకు వండి పెట్టాలంటే పెరిగిన ధరలతో సాధ్యపడదని అన్నారు. వంట గ్యాస్ కు మధ్యాహ్నం భోజనం పథకంలో బడ్జెట్ నిధులు కేటాయించకపోవడం వలన గ్యాస్ ధరలు పెరిగిన నేపథ్యంలో వంటలు ఎలా చేస్తారని అన్నారు. వంట గ్యాస్ కు, కోడిగుడ్లకు ప్రభుత్వమే పాఠశాలలకు నేరుగా సరఫరా చేయాలని రాజకీయ ఒత్తిళ్లకు లోను కా పాతవారిని తొలగించకూడదని, వంట కార్మికులకు గుర్తింపు కార్డులు, రెండు జతల యూనిఫాం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ మురహరి రఘు , మధ్యాహ్న భోజన వర్కర్ సీనియర్ మండల అధ్యక్షురాలు సత్యవతి, కార్యదర్శి శ్రీదేవి, రోజా, జయలక్ష్మి, సుగుణ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.




# బంగారం ఉన్న బ్యాగును పోలీసులకు అప్పగించిన ఆటో డ్రైవర్

**ఆటోడ్రైవర్ నిజాయితీకి పోలీసులు ఘన సన్మానం**

**మహా వరంగల్ క్రైం :** భద్రాచలం నివాసి అయిన అడ్డ గూడూరు సత్యనారాయణ గురువారం వరంగల్ నగరంలోని రామన్నపేటలో జరిగిన వారి బంధువుల వివాహా వేడుకకు హాజరయ్యేందుకు వరంగల్ కు వచ్చారు. వరంగల్ బస్ స్టాండ్ నుండి టీఎస్ 03 యూఏ 3340 నంబర్ గల ఆటోలో ప్రయాణించి గమ్యస్థానానికి చేరుకున్నారు. హడావుడిలో తమ వద్ద ఉన్న లగేజీ బ్యాగ్ ను కాస్త ఆటో లోనే మరిచి పోయారు.ఆ బ్యాగ్‌లో సుమారు 10 తులాల బంగారు ఆభరణాలు, దుస్తులతో పాటు ఇతర విలువైన వస్తువులు ఉన్నాయి. విషయం గుర్తించిన వెంటనే వారు స్థానిక మట్వాడ పోలీస్ స్టేషన్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న మట్వాడ పోలీసులు వెంటనే సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ఆటోను గుర్తించే ప్రయత్నాలు ప్రారంభించారు. అదే సమయంలో వరంగల్ ఎల్‌బీ నగర్ కు చెందిన ఆటో డ్రైవర్ మిర్జా ఇఫ్తేఖార్ బేగ్ తన ఆటోలో మరిచిపోయిన బ్యాగ్‌ను గుర్తించి నిజాయితీగా మట్వాడ పోలీస్ స్టేషన్‌కు వచ్చి అందులోని 10 తులాల బంగారు ఆభరణాలతో సహా అన్ని వస్తువులను యథాతథంగా పోలీసులకు అప్పగించారు.ఆటో డ్రైవర్ మిర్జా ఇఫ్తేఖార్ బేగ్ చూపించిన నిజాయితీ, బాధ్యతాయుతమైన సేవా భావాన్ని అభినందిస్తూ మట్వాడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎన్ కరుణాకర్ రావు, ఎస్ఐ సబ్బాని శివకృష్ణ ఆయనను శాలువాతో సత్కరించి అభినందించారు.



# నాటు తుపాకీతో అడవిలో పట్టుబడిన ముఠా

**14 రోజుల రిమాండ్.**

**సత్తుపల్లి సబ్ జైలుకు తరలింపు.**

**దమ్మపేట, జూన్ 18 మహా :** నాటుతుపాకీతో అడవిలో సంచరిస్తున్న కొందరి ముఠాను గురువారం అటవీశాఖ అధికారులు గుర్తించారు. దమ్మపేట జూనియర్ సివిల్ జడ్జి భవానీ ముందర హాజరు పరచగా ,14 రోజుల పాటు రిమాండ్ విధించగా సత్తుపల్లి సబ్ జైలుకు తరలించారు. వివరాలు పరిశీలిస్తే మండల పరిధిలోని గండుగులపల్లి బీట్ పరిధిలో అనుమానాస్పదంగా వేటకు వచ్చిన నలుగురు వ్యక్తులను అటవీ శాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. బీట్ ఆఫీసర్ భవాని సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా నిందితులు నాటు తుపాకీతో ఫారెస్ట్ అధికారులకు తారసపడ్డారు. అధికారులను చూసిన నిందితులు రెండు బైక్లు, నాటు తుపాకీ, ఆరు తూటాలు, టార్చ్ లైట్, బ్యాగ్ అక్కడే వదిలి పరారవుతుండగా ఫారెస్ట్ అధికారులు చేజ్ చేసి పట్టుకున్నారు. అనంతరం నలుగురిని అరెస్టు చేసి వైల్డ్ లైఫ్ యాక్ట్ క్రింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రేంజర్ శ్రీనివాసరావు తెలిపారు.

# రహదారి పక్కన కంపచెట్ల తొలగింపు

**తల్లాడ, జూన్ 18 (మహా):** తల్లాడ మండలం అన్నారుగూడెం-కేతినేని థియేటర్ రోడ్డులో వాహనదారులకు ఇబ్బందిగా మారిన కంపచెట్లు, పిచ్చి మొక్కలను గ్రామపంచాయతీ సిబ్బంది తొలగించారు. సర్పంచ్ గొడ్ల ప్రభాకర్, ఉపసర్పంచ్ కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ) పనులను పర్యవేక్షించారు. మూలమలుపుల వద్ద పెరిగిన పొదల కారణంగా ప్రమాదాల ముప్పు ఉండటంతో ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



# కంది మౌనా శ్రీనివాస రెడ్డి పరామర్శలు

**ఆదిలాబాద్ మహా :** ఆప్తులను కోల్పోయి పుట్టెడు దుఖంలో ఉన్నవారి కుటుంబాలకు ,అనారోగ్యంతో బాధపడుతున్నవారి చెంతకు వెళ్లి వారికి కొండంత ధైర్యాన్ని ఇస్తారు ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సతీమణి కంది మౌనా శ్రీనివాస రెడ్డి. గురువారం సాత్నాల మండలం మేడిగూడ గ్రామానికి చెందిన సామ భోజరెడ్డి, చిట్యాల భగవాండ్లు అనారోగ్యంతో బాధపడుతుండడంతో వారిని పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అలాగే ఇటీవలె అనారోగ్యంతో మృతి చెందిన దుబ్బగూడ గ్రామానికి చెందిన టేకం గంటు బాయి, ప్రమాదవశాత్తు మృతిచెందిన సాలై తాండ గ్రామానికి చెందిన రాజ్ కుమార్ ,అనారోగ్యంతో మృతి చెందిన జైనథ్ మండలం దీపాయిగూడ గ్రామానికి చెందిన కజ్జర్ల లోక కిష్టారెడ్డి నివాసాలకి వెళ్లి ఆయా కుటుంబాలను పరామర్శించి వారి మృతి పట్ల తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసారు. ఆమె వెంట ఆత్మ కమిటీ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు,సుందర్ గిరి సర్పంచ్ కుమ్ర కమల బాయి, ఉప సర్పంచ్ నిమ్మల గౌతమ్ రెడ్డి,దుబ్బగూడ సర్పంచ్ జాదవ్ కాలురామ్ కాంగ్రెస్ నాయకులు అల్చెట్టి నాగన్న,ఎం ఎ షకీల్, డేరా కృష్ణా రెడ్డి, బోనగిటి సంటెన్న, భూమన్న, ఏనుగు రవీందర్ రెడ్డి, రాథోడ్ శ్యామ్ రావు, క్యాతం శివప్రసాద్ రెడ్డి,సోయం అవినాష్ తదితరులున్నారు.

# ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు సమర్ధవంతంగా నిర్వహించాలి

- **జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ జోనల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి యు సి డిటీమ్ (పిఓలు,సీఓల)తో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో కొత్త స్వయం సహాయక సంఘాల ( ఎస్ హెచ్ జి ఎస్ ) ఏర్పాటును వేగవంతం చేయాలి, బ్యాంక్ లింకేజీల పురోగతి, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల నిర్వహణ, అభివృద్ధి, ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం అమలుపై విస్తృతంగా చర్చించారు. కొత్త (ఎస్ ఎస్ జి ) గ్రూపుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలి, నిర్దేశిత లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి సూచించారు., బ్యాంక్ లింకేజీలను మెరుగుపరచడం, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ల కార్యకలాపాలను సమర్ధవంతంగా నిర్వహించాలి. ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలులో అధికారులు సమన్వయంతో పనిచేసి లక్ష్యాలను సాధించాలని జోనల్ కమిషనర్ సూచించారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్లు (పి ఓ లు), కమ్యూనిటీ ఆర్గనైజర్లు (సి ఓ లు) సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# గోదాదేవి రంగనాథుడి సన్నిధిలో గవర్నర్ ప్రత్యేక పూజలు

**కుషాయిగూడ మహా :** హెచ్‌బీ కాలనీలోని శ్రీరంగగిరి శ్రీ గోదాదేవి రంగనాథ స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న వికారి శ్వారి క్రతు జీవహోత్తవ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా గురువారం పాల్గొన్నారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో కలిసి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు గవర్నర్‌కు పూర్ణ కుంభ స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం నిర్వహించిన ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొన్న గవర్నర్ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో వైద్య విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు గవర్నర్ చెక్కులు పంపిణీ చేశారు. విద్య ద్వారా ఉన్నత స్థానాలకు చేరుకుని సమాజ సేవలో ముందుండాలని విద్యార్థులకు సూచించారు. ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారు నీలం రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భారీగా పట్టుబడిన బంగారం హైడ్రోపానిక్ గంజాయి

- **శంషాబాద్ ఎయిర్ పోర్టులో కస్టమ్స్ అధికారుల తనిఖీలు**
- **7.118 కిలోల గంజాయి 374 గ్రాముల బంగారం స్వాధీనం..**

**రాజేంద్రనగర్ మహా:**శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా బంగారంతో పాటు గంజాయిని పట్టుకున్న కస్టమ్స్ అధికారులు. గురువారం కౌలంపూర్ నుండి శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయనికి వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించగా, ఒక ప్రయాణికుని వద్ద 374 గ్రాముల బంగారం గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. విదేశాలనుంచి వచ్చిన నిందితుడు బంగారాన్ని లోదుస్తులో దాచి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారుల చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డాడు. బంగారం విలువ సుమారు 55 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. ప్రయాణికున్ని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టారు.బ్యాంకాక్ నుంచి వచ్చిన మరో ప్రయాణికుడు రెండు కోట్ల పైగా విలువచేసే, సుమారు 7 కిలోల హైడ్రోపానిక్ గంజాయిని తరలించే ప్రయత్నం చేస్తున్న క్రమంలో అనుమానం వచ్చిన కస్టమ్స్ అధికారులు అతనిని తనిఖీ చేయగా అతని వద్ద హైడ్రోపోనిక్ గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయి ని స్వాధీనం చేసుకొని, అక్రమాలకు పాల్పడిన ప్రయాణికులను అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు కస్టమ్స్ అధికారులు వెల్లడించారు..

# దాబాల నిర్వాహకులకు డీఎస్పీ సూచనలు

**ఆదిలాబాద్ మహా :** దాబాలలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాలతో గురువారం జిల్లా కేంద్రంలోని డి.ఎస్.పి కార్యాలయంలో ఆయన దాబాల నిర్వాహకులు ఓనర్లతో సమావేశం నిర్వహించి వారికి పలు సూచనలు చేసారు. దాబాలలో మద్యం సేవించడం, మద్యం అమ్మకం, గంజాయి, మాదకద్రవ్యాలు లాంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. దాబాలలో మద్యం సేవించడం వల్ల, జాతీయ రహదారులపై పార్కింగ్ చేయడం వల్ల వాహన ప్రమాదాలు సంభవించి ప్రాణనష్టం పెరుగుతుందని అన్నారు. ప్రమాదాల నివారణకు ఇలాంటి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రమాదాలు జరిగితే దాబా యజమానులు బాధ్యతను వహించాల్సి వస్తుందని అన్నారు. ముఖ్యంగా ప్రతి ఒక్క దాబాలో మంచి సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కెమెరాలలో దాబాలలో వస్తున్న వారు వెళ్తున్నవారు దాబా పరిసర ప్రాంతాలు హైవే లాంటి ప్రదేశాలు పూర్తిగా నిక్షిప్తమయ్యే విధంగా చూసుకోవాలన్నారు. దాబాకు వచ్చే ప్రతి వాహనం దాబా యొక్క పార్కింగ్ స్థలాలలో మాత్రమే నిలిపి ఉండాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్డుపై పార్కింగ్ చేయరాదని తెలియజేశారు. అనుమానస్పద వ్యక్తులకు ఎలాంటి ఆశ్రయం కల్పించవద్దని, అలాంటి వ్యక్తుల సమాచారం వెంటనే పోలీస్ యంత్రాంగానికి తెలియజేయాలని తెలిపారు. పదేపదే నిబంధనలు ఉల్లంఘించి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తూ బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐలు బి సునీల్ కుమార్, బి డి ప్రేమ్ కుమార్, రహీం పాషా, కె నాగరాజు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్చువల్ విధానంలో రూ.1.84 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించిన సీఎం

**పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్**



మహా వరంగల్ బ్యూరో;రాష్ట్ర స్థాయి వన మహోత్సవ్ -2026 వేడుకల సందర్భంగా వరంగల్ జిల్లాలో అటవీ శాఖ ఆధ్వర్యంలో పూర్తి చేసిన అభివృద్ధి, ఎకోటూరిజం మౌలిక సదుపాయాల పనులను గురువారం సాయంత్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ విధానంలో రూ.1.84 కోట్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి హాజరయ్యారు.ఈ సందర్భంగా నర్సంపేట రేంజ్ పరిధిలోని పాఖాల్ బయోడైవర్సిటీ పార్క్ లో సందర్శకుల సౌకర్యాల విస్తరణకు చేపట్టిన పలు పనులు అందుబాటులోకి వచ్చాయి. సఫారీ వాహనాలు, పెడల్ బోటింగ్ పూల్, పర్యావరణ విద్యా కేంద్రం (ఈఈసీ) భవనం, డార్మిటరీ హాల్, నైట్ క్యాంపింగ్ ప్రాంతం, ఆర్‌వో ప్లాంట్, సీసీ రోడ్ల నిర్మాణం వంటి పనులను హరిత నిధి, బయోసోట్ , అఫారెస్టేషన్ ఫండ్స్, జాపాట్ పథకాల కింద రూ.153.95 లక్షల వ్యయంతో పూర్తి చేశారు.అదేవిధంగా, వరంగల్ జిల్లా అటవీ కార్యాలయ భవనంలో పునరుద్ధరణ, ఆధునికీకరణ పనులను సీఏపీడీ ఇంటరెస్ట్ నిధుల కింద రూ.30 లక్షల వ్యయంతో చేపట్టి పూర్తి చేశారు.మొత్తం రూ.183.95 లక్షల విలువైన ఈ అభివృద్ధి పనులు ఎకోటూరిజం ప్రోత్సాహం, పర్యావరణ విద్య విస్తరణ, సందర్శకులకు మెరుగైన సౌకర్యాల కల్పన, అటవీ శాఖ మౌలిక వసతుల బలోపేతానికి దోహద పడ నున్నాయని అధికారులు తెలిపారు. వన మహోత్సవ్ సందర్భంగా ఈ పనుల ప్రారంభం రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, అటవీ సంపద అభివృద్ధి, ప్రకృతి ఆధారిత పర్యాటక రంగ ప్రోత్సాహానికి ఇస్తున్న ప్రాధాన్యతను ప్రతి బింబిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజా ప్రతినిధులచే మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా జ్యూట్ బ్యాగులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం లో జిల్లా కలెక్టర్ సత్య శారద, సీపీ సన్ ప్రీత్ సింగ్ ,అదనపు కలెక్టర్లు గణేష్, సంధ్యారాణి, ఆర్డీవో ఉమా రాణి, డిఎఫ్ వో బోగ నిఖిత, ఏసీపీ రవీందర్ రెడ్డి, వరంగల్ ఎఫ్ ఆర్ వో రాధిక, నర్సంపేట ఎఫ్ ఆర్ వో నరేష్ పాల్గొన్నారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యంమున్సిపల్ చైర్ పర్సన్

**ఆదిలాబాద్ మహా :** యోగా ద్వారా సంపూర్ణ ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష అన్నారు. వరల్డ్ యోగా డేను పురస్కరించుకుని గురువారం ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ తో కలిసి పట్టణంలో నిర్వహించినయోగ వాక్ ను ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ..ఉరుకుల పరుగుల జీవితంలో ఒత్తిడిని జయించాలంటే ప్రతి వ్యక్తి తమ దినచర్యలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో రిమ్స్ డైరక్టర్ డాక్టర్ జైసింగ్ రాథోడ్ డీఎంహెచ్‌వో డాక్టర్ సాధనా ఆయుష్ విభాగం వైద్యులు, రిమ్స్ కళాశాల సిబ్బంది, నర్సింగ్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# వార్డులలో అభివృద్ధి పనులు

**భూమి పూజ చేసిన మున్సిపల్ చైర్ పర్సన్**
**అన్ని వార్డుల అభివృద్ధే లక్ష్యమని వెల్లడి**

**ఆదిలాబాద్ మహా :** అదిలాబాద్ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్ అన్నారు. గురువారం పట్టణంలోని పలు వార్డులలో అభివృద్ధి పనులకు భూమిపూజ నిర్వహించారు. ఫిల్టర్ బెడ్ వద్ద రూ.10 లక్షల వ్యయంతో కాంపౌండ్ వాల్, 16 వార్డు సుందరయ్య నగర్ లో 50 లక్షల వ్యయంతో శానిటేషన్ వాహనాల కోసం ఆధునిక గ్యారేజ్ నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు.ఈ గ్యారేజ్ లో వాటర్ సర్వీసింగ్, వెల్డింగ్, మరమ్మత్తులు తదితర సౌకర్యాలు ఏర్పాటు కానున్నాయన్నారు. . దీంతో మున్సిపాలిటీ పరిధిలోని శానిటేషన్ వాహనాల మరమ్మత్తులు ఒకేచోట సమర్ధవంతంగా నిర్వహించే అవకాశం కలుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మంజూరు చేసిన ఫ్లడ్ నిధుల ద్వారా రూ.1.10 కోట్ల వ్యయంతో కల్వర్టులు, ప్యాచ్‌వర్క్‌లు ఇతర మౌలిక వసతుల పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అదిలాబాద్ పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, సర్వాంగ సుందర నగరంగా తీర్చిదిద్దేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రోహిత్, మున్సిపల్ కమిషనర్ జగదీష్ గౌడ్ ,మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ ఇజ్జగిరి సంజయ్, టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ ఎనగంటి ప్రకాష్, కౌన్సిలర్లు, స్వాతి మంగేష్ , సలీం,జిశాన్ , అర్బాజ్ , ఏఈ కిరణ్ , నితిన్ , డిఈ సందీప్ , ఈఈ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మోసం చేసిన మహిళ అరెస్ట్

**ఆదిలాబాద్ మహా :** భూ విక్రయానికి మధ్యవర్తిత్వం చేస్తూ, వృద్ధ మహిళకు చెందిన భూమి అడ్వాన్స్ డబ్బులను మోసపూరితంగా కాజేసిన మహిళను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్. జీవన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.శాంతి నగర్‌కు చెందిన 80 ఏళ్ల వృద్ధురాలు బొజ్జ లసుంబాయి తంతోలి గ్రామంలోని తన భూమిని విక్రయించేందుకు నిందితురాలు బృందావని కాలనీకి చెందిన దాసరి జ్యోతిరాజ్ సహాయం కోరింది. ఈ క్రమంలో తంతోలి గ్రామానికి చెందిన కొత్తపల్లి సంతోష్‌తో భూమి విక్రయ ఒప్పందం కుదరగా గత సంవత్సరం జనవరి 24న అడ్వాన్స్‌గా 5 లక్షలు చెల్లించాడు.అయితే ఆ నగదును నిందితురాలు తన వద్ద భద్రంగా ఉంచుతానని చెప్పి బాధితురాలిని నమ్మించి ఇంటికి పంపించింది. మరుసటి రోజే డబ్బులతో హైదరాబాద్‌కు పరారైంది. బాధితురాలు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ రేపు మాపు అంటూ కాలయాపన చేస్తూ మోసం చేసింది.తాజాగా ఆదిలాబాద్‌కు తిరిగి వచ్చిన నిందితురాలిని ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని డీఎస్పీ తెలిపారు.ప్రజలను మోసం చేసి, డబ్బులను దండుకునే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.



# గోదావరి పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ మహా: బాసరలో జరగనున్న గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం బాసర పుష్కరాల ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే సంవత్సరంలో నిర్వహించే గోదావరి పుష్కరాలకు వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని అన్ని ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యంగా పాత పుష్కర ఘాట్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టడంతో పాటు, అవసరమైన చోట కొత్త ఘాట్ల నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పుష్కర ఘాట్లను భక్తులకు కనువిందుగా ఉండేలా సుందరీకరించాలని, కళ్యాణ కట్ట, పిండ ప్రదాన వేదికలు, దుస్తులు మార్చుకునే గదులను తక్షణమే నిర్మించాలని సూచించారు. చేపట్టే ప్రతి నిర్మాణ పనిలో నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని, ఘాట్ల సమీపంలో భక్తులకు తాగునీటి కొరత లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.అలాగే, ఆయా శాఖల అధికారులు తమకు కేటాయించిన పనులకు సంబంధించిన పూర్తి స్థాయి ప్రతిపాదనలను వెంటనే సిద్ధం చేసి సమర్పించాలని సూచించారు. ఈ సందర్భంగా బాసర ఆలయ మాస్టర్ ప్లాన్‌పై కూడా చర్చించారు.ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, బాసర ఆలయ ఈవో అంజనా దేవి, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ సందీప్, వివిధ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్ కమిషనరేట్ లో ఎస్ఐ ల భారీ బదిలీలు

**23 మంది అధికారులకు కొత్త పోస్టింగ్‌లు**
**తొమ్మిది మంది మహిళా ఎస్ఐ లకు స్థానచలనం**




మహా వరంగల్ క్రైం;వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 23 మంది సబ్ ఇన్‌స్పెక్టర్లను (ఎస్ఐలు) వివిధ పోలీస్ స్టేషన్లు, ప్రత్యేక విభాగాలకు బదిలీ చేస్తూ గురువారం పోలీస్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా కారణాల రీత్యా తక్షణమే అమల్లోకి వచ్చేలా ఈ బదిలీలు చేపట్టినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బదిలీ అయిన వారిలో తొమ్మిది మంది మహిళా ఎస్ఐలు ఉండటం మరో విశేషం. బదిలీ జాబితాలో సి.సి.ఆర్.బీ, సి.పీ.టి.సీ, కమాండ్ కంట్రోల్ సెంటర్, ఐటీ సెల్, భరోసా సెంటర్, ట్రాఫిక్ విభాగాల్లో పనిచేస్తున్న అధికారులు కూడా ఉన్నారు. పలువురు ఎస్ఐలను సుబేదారి, కాజీపేట, హనుమకొండ, మిల్స్ కాలనీ, ఇంతేజార్గంజ్, పరకాల, నర్సంపేట, గీసుగొండ పోలీస్ స్టేషన్లకు బదిలీ చేశారు. మహిళా ఎస్ఐలలో ఎస్.మౌనికను డబ్ల్యూపీఎస్2 సుబేదారి నుంచి కాజీపేట పోలీస్ స్టేషన్‌కు, తౌటం శ్రావణిని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి కేయూసీ పోలీస్ స్టేషన్‌కు, డి.నిహారికను మిల్స్ కాలనీ పోలీస్ స్టేషన్‌కు, వి.భవానిని ఇంతేజార్గంజ్ పోలీస్ స్టేషన్‌కు, ఎన్.సాయి దివ్యను హనుమకొండ పోలీస్ స్టేషన్‌కు, కె.లక్ష్మిని సుబేదారి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. అంతేకాకుండా హనుమకొండ ట్రాఫిక్ పీఎస్‌లో పనిచేస్తున్న ఎల్.కొమురెల్లిని సెంట్రల్ బ్రాంచ్ (సీఎస్‌బీ)కి, ఇంతేజార్గంజ్ పీఎస్‌లోని ఎన్. రవికిరణ్, సుబేదారి పీఎస్‌లోని ఎస్.వెంకన్నలను కూడా సీఎస్‌బీకి బదిలీ చేశారు. టాస్క్‌ఫోర్స్ లో పనిచేస్తున్న బి.చందర్‌ను సీసీఎస్‌కు, పరకాల పీఎస్‌లోని ఎం.రమేష్, మిల్స్ కాలనీ పీఎస్‌లోని ఎల్. నరేష్‌లను సీసీఆర్‌బీకి బదిలీ చేశారు.ఐనవోలు ఎస్‌హెచ్‌వో గా పనిచేస్తున్న పి. శ్రీనివాస్‌ను పీసీఆర్ విభాగానికి బదిలీ చేసి కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అటాచ్ చేశారు. బదిలీ అయిన అధికారులు వెంటనే కొత్త విధుల్లో చేరాలని కమిషనర్ ఆదేశించారు.



## శాంతి భద్రతల పరిరక్షణలో.. కమిషనర్ కీలక భూమిక

**మర్యాదపూర్వకంగా సిపిని కలిసిన మునిగాల నరసయ్య**

**కుషాయిగూడ, మహా :** శాంతి భద్రతల పరిరక్షణలో నేరాలను అదుపు చేయడంలో పోకిరిలను అరికట్టడంలో సిపి సుమతి కృషి ప్రశంసనీయమని కేసీఆర్ కూరగాయల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునిగాల నరసింహ పేర్కొన్నారు. ప్రగతి నగర్ కు చెందిన కెసిఆర్ కూరగాయల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మునగాల నరసింహ తదితరులు కమిషనర్ సుమతిని కలిసి పుష్పగుచ్చాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ జవహర్ నగర్ లో పోకిరిల ఆగడాలు వంటి సమస్యలపై సిపి దృష్టికి తీసుకెళ్లగా తక్షణమే స్పందించిన సిపి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. పర్యావరణ పరిరక్షనే ధ్యేయంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాత్రికేయులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కేటీఆర్ సభను విజయవంతం చేయండి..

**మండల అధ్యక్షులు మోహన్ రావు..**

**రాజేంద్రనగర్ మహా :** శంషాబాద్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచర్ల మోహన్ రావు ఆధ్వర్యంలో జిల్లా పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. సమావేశంలో మోహన్ రావు మాట్లాడుతూ ఈనెల 21న శంషాబాద్ లో కేటీఆర్ సభను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దిద్యాల శ్రీనివాస్, బుర్కుంట సతీష్, సయ్యద్ గౌస్ పాషా, రాజశేఖర్ గౌడ్, సర్పంచ్ బిఖ్యానాయక్, అక్కం రాజు, చెన్నకేశవులు, గోపాల్, మహేష్ యాదవ్, చెక్కల చంద్రశేఖర్, వీరాచారి, శివశంకర్, రాఘవేంద్ర, మురళి తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాలకు ప్రత్యేక శిక్షణ

**రాజేంద్రనగర్, మహా:** మహిళా సంఘాలు, మోడల్ క్లస్టర్ లెవెల్ ఫెడరేషన్ల బలోపేతం కోసం శంషాబాద్ మండలంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. స్టేట్ రిసోర్స్ పర్సన్లు ప్రమీల, ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 28 గ్రామ సంఘాల వీవోలు, సంఘం అధ్యక్షులు పాల్గొన్నారు. మహిళల్లో నాయకత్వ లక్షణాలు, ఆర్థిక అక్షరాస్యత పెంపుతో పాటు వ్యక్తిగత, కుటుంబ, గ్రామాభివృద్ధికి లక్ష్యాలు నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, ఏపీఎంలు, సీసీలు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.



## వన మహోత్సవంలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే

**రాజేంద్రనగర్, మహా:** శంషాబాద్ మండలం మల్కారం గ్రామంలో నిర్వహించిన వన మహోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అడవి శాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని గ్రామస్తులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫారెస్ట్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

## పోర్షే కొత్త కారు లాంచ్: ధర ఎంతంటే?



పోర్షే భారతదేశంలో కొత్త తరం 911 GT3ను లాంచ్ చేసింది. దీని ధర రూ. 3.32 కోట్లు (ఎక్స్‌షోరూమ్). కంపెనీ దీనికోసం బుకింగ్స్ స్వీకరించడం కూడా ప్రారంభించింది. డెలివరీలు ఈ ఏడాది చివరి నాటికి ప్రారంభమయ్యే అవకాశం ఉంది. పోర్షే 911 జీటీ3 కారులో న్యాచురల్లీ ఆస్పిరేటెడ్ 4.0 లీటర్ సిక్స్ సిలిండర్ ఇంజన్ ఉంటుంది. ఇది 503 బీహెచ్‌పీ పవర్, 470 న్యూటన్ మీటర్ టార్క్ అందిస్తుంది. ఇది 3.4 సెకన్లలో గంటకు 0 నుంచి 100 కిమీ వరకు వేగవంతం అవుతుంది. గ్లోబల్ మార్కెట్లో ఈ కారు మాన్యువల్ గేర్‌బాక్స్‌తో లభిస్తుంది. కానీ ఇండియన్ మార్కెట్లో స్టాండర్డ్‌గా పీడీకే గేర్‌బాక్స్‌ను అందిస్తున్నారు. 10 రంగులలో లభించే ఈ కారు 21 ఇంచెస్ అల్యూమినియం వీల్స్ పొందుతుంది. ఇంటీరియర్ సిల్వర్ థీమ్ పొందుతుంది. ప్రత్యేకమైన సీట్లు, రూఫ్ ఫినిష్, సీట్ బెల్ట్‌లు, వీల్స్ నుంచి కార్బన్ ఫైబర్ ఇన్సర్ట్‌లు మొదలైనవి ఉన్నాయి. పనితీరు అద్భుతంగా ఉంటుందని కంపెనీ వెల్లడించింది.

## ఎన్నారైల బ్యాంక్ డిపాజిట్లపై ఆర్బీఐ కీలక నిర్ణయం



భారత ఆర్థిక వ్యవస్థకు విదేశీ మారకద్రవ్య ప్రవాహాలను పెంచే దిశగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నారైలు, ఓవర్సీస్ సిటిజన్స్ ఆఫ్ ఇండియా నుంచి అధిక మొత్తంలో డిపాజిట్లను ఆకర్షించేందుకు ఎంపిక చేసిన నాన్‌రెసిడెంట్ ఎక్స్‌టర్నల్, ఫారిన్ కరెన్సీ నాన్‌రెసిడెంట్ డిపాజిట్లపై అమలులో ఉన్న వడ్డీ రేటు పరిమితులను తాత్కాలికంగా తొలగించింది. ఈ సడలింపు 2026 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది.ఆర్బీఐ తాజా మార్గదర్శకాల ప్రకారం.. మూడు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ కాలపరిమితి గల తాజా ఎన్ఆర్ఈ డిపాజిట్లపై బ్యాంకులు తమ అవసరాలకు అనుగుణంగా అధిక వడ్డీ రేట్లు ప్రకటించవచ్చు. అలాగే మూడు నుంచి ఐదు సంవత్సరాల కాలపరిమితి గల కొత్త ఎఫ్‌సీఎన్ఆర్‌బీ డిపాజిట్లపై కూడా ఇప్పటివరకు ఉన్న వడ్డీ పరిమితులు వర్తించవు. ఈ సడలింపు కొత్తగా సమీకరించే డిపాజిట్లకే కాకుండా, మెచ్యూరిటీ అనంతరం పునరుద్ధరించే అర్హత గల డిపాజిట్లకు కూడా వర్తిస్తుంది. ఇప్పటి వరకు ఎన్ఆర్ఈ డిపాజిట్లపై వడ్డీ రేట్లు సమాన కాలపరిమితి గల దేశీయ రూపాయి టర్మ్ డిపాజిట్ల కంటే ఎక్కువగా ఉండకూడదనే నిబంధన అమల్లో ఉండేది. అలాగే ఎఫ్‌సీఎన్ఆర్‌బీ డిపాజిట్లపై కూడా నిర్దిష్ట పరిమితులు ఉండేవి. ఇప్పుడు ఆ పరిమితులు తొలగించడంతో బ్యాంకులు ఎన్నారై డిపాజిట్ల కోసం మరింత పోటీగా వడ్డీ రేట్లు ప్రకటించే అవకాశం ఏర్పడింది.ఇటీవల అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, ముడి చమురు ధరల పెరుగుదల, విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి వంటి అంశాల నేపథ్యంలో విదేశీ కరెన్సీ ప్రవాహాలను పెంచేందుకు ఆర్బీఐ చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగానే ఈ నెల ప్రారంభంలో మూడు నుంచి ఐదు సంవత్సరాల కాలపరిమితి గల తాజా ఎఫ్‌సీఎన్ఆర్‌బీ డిపాజిట్లకు సంబంధించిన పూర్తి హెడ్జింగ్ వ్యయాన్ని తానే భరిస్తామని కూడా ప్రకటించింది. అంతేకాకుండా ఈ డిపాజిట్లను సీఆర్ఆర్, ఎస్ఎల్ఆర్ నిబంధనల నుంచి కూడా తాత్కాలికంగా మినహాయించింది.మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం.. ఇప్పటికే పలు బ్యాంకులు అమెరికన్ డాలర్ ఆధారిత ఎఫ్‌సీఎన్ఆర్‌బీ డిపాజిట్లపై 6 శాతం నుంచి 7 శాతం వరకు వడ్డీ రేట్లను ప్రకటించాయి. చిన్న, మధ్య తరహా బ్యాంకులు డిపాజిట్ల కోసం మరింత ఆకర్షణీయమైన రేట్లు ప్రకటించే అవకాశముందని బ్యాంకింగ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే, ఎన్ఆర్వో ఖాతాల నుంచి ఎన్ఆర్ఈ ఖాతాలకు బదిలీ చేసిన నిధులకు ఈ ప్రత్యేక మినహాయింపు వర్తించదని ఆర్బీఐ స్పష్టం చేసింది.

## బంగారాన్ని మించిన ఆస్తులున్నాయ్: కియోసాకి



ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం, అప్పులు, ఫెడరల్ రిజర్వ్ విధానాలపై చర్చలు జరుగుతున్న వేళ, ప్రముఖ ఆర్థిక వ్యాఖ్యాత, 'రిచ్ డాడ్ పూర్ డాడ్' (Rich Dad Poor Dad) పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి తన ఫేస్‌బుక్ పోస్ట్ ద్వారా మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. కియోసాకి అభిప్రాయం ప్రకారం, అమెరికా ప్రభుత్వం ప్రస్తుతం 37 ట్రిలియన్ డాలర్ల అప్పు భారంతో ఉంది. కొత్త ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ ద్రవ్యోల్బణాన్ని మరింత వేడెక్కనివ్వడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో, సాధారణంగా బ్యాంకుల్లో డిపాజిట్లు, సీడీలు, ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడులు పెట్టే "పూర్ సేవర్స్" తమ డబ్బు విలువను నిశ్శబ్దంగా కోల్పోతారని ఆయన హెచ్చరించారు. "గోల్డ్ ఒక మంచి రక్షణ. 1970లలో అది విలువను నిలబెట్టుకుంది. కానీ అది కేవలం నీటిని నిల్వ చేసే సీసా లాంటిది. లీక్ కాకుండా కాపాడుతుంది. కానీ నిజమైన ధనవంతులు ద్రవ్యోల్బణం వల్ల లాభపడే ఆస్తులను ఎంచుకుంటారు" అని కియోసాకి వ్యాఖ్యానించారు. ఆయన ప్రకారం, గోల్డ్ మాత్రమే కాదు, చరిత్రలో ద్రవ్యోల్బణం వల్ల మరింత పెరిగిన మూడు ప్రత్యేక ఆస్తులు ఉన్నాయని, వాటిని త్వరలోనే వెల్లడిస్తానని తెలిపారు.

## ఏకంగా 80 శాతం మందిని తొలగించిన టెక్ సీఈవో



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఇప్పుడు దాదాపు ఉద్యోగులందరి వృత్తిగత జీవితంలో భాగమైపోయింది. కంపెనీలు రెండు మూడేళ్ల క్రితం నుంచే ఏఐ వెంట పడుతున్నాయి. ఈ క్రమంలో ఉద్యోగులకు ఏఐ నైపుణ్యాలు తప్పనిసరి అయిపోయాయి. ఏఐ స్కిల్స్ లేని, నేర్చుకోని ఉద్యోగులను కంపెనీలు నిర్దాక్షిణ్యంగా తొలగిస్తున్నాయి. అమెరికాలోని టెక్సాస్ కేంద్రంగా పనిచేస్తున్న ఎంటర్‌ప్రైజ్ సాఫ్ట్‌వేర్ సంస్థ 'ఇగ్నైట్‌టెక్' (IgniteTech) సీఈవో ఎరిక్ వాఘన్ (Eric Vaughan) తీసుకున్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఏఐ వినియోగాన్ని స్వీకరించడానికి నిరాకరించిన ఉద్యోగులను సంస్థ నుంచి తొలగించి, దాదాపు 80 శాతం మంది సిబ్బందిని కొత్త వారితో భర్తీ చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు ఇటీవల నిర్వహించిన ఫార్చ్యూన్ బ్రెయిన్‌స్టార్మ్ టెక్ కార్యక్రమంలో వెలుగులోకి వచ్చాయి. జనరేటివ్ ఏఐ వ్యాపార ప్రపంచాన్ని పూర్తిగా మార్చేస్తుందని భావించి 2023లో తమ సంస్థను "ఏఐఫస్ట్" మోడల్‌లోకి మార్చే కార్యక్రమాన్ని ఇగ్నైట్‌టెక్ సీఈవో ఎరిక్ వాఘన్ ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రతి వారం "ఏఐ మండేస్" పేరుతో ఒక రోజంతా ఉద్యోగులు ఏఐ ప్రాజెక్టులపైనే పనిచేయాలని నిబంధన పెట్టారు. ఏఐ టూల్స్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్ కోర్సులు నేర్పించడానికి కంపెనీనే ఖర్చు భరించేది. బయటి నుంచి నిపుణులతో శిక్షణ కార్యక్రమాలు సైతం నిర్వహించేది. ఇందు కోసం కంపెనీ తన మొత్తం పేరోల్‌లో సుమారు 20 శాతం వరకు వెచ్చించినట్లు వాఘన్ తెలిపారు.అయితే ఈ మార్పును ఉద్యోగులంతా సమానంగా స్వీకరించలేదని, ముఖ్యంగా సాంకేతిక విభాగాల్లో తీవ్ర వ్యతిరేకత ఎదురైందని వాఘన్ చెప్పారు. శిక్షణ, ప్రోత్సాహకాలు ఉన్నప్పటికీ కొందరు ఏఐ వినియోగాన్ని పూర్తిగా తిరస్కరించడంతో 2023 నుంచి 2024 తొలి త్రైమాసికం మధ్య వందలాది మంది ఉద్యోగులను తొలగించి కొత్త వారితో భర్తీ చేయాల్సి వచ్చిందన్నారు. "ఇది మా లక్ష్యం కాదు. కానీ కొత్త నైపుణ్యాలు నేర్పడం కంటే మనస్తత్వాన్ని మార్చడం కష్టమైంది" అని ఆయన వ్యాఖ్యానించారు. వివాదాస్పదమైన ఈ నిర్ణయాన్ని ఇప్పటికీ సమర్థిస్తున్న వాఘన్, అదే పరిస్థితి మళ్లీ వస్తే ఇదే నిర్ణయం తీసుకుంటానని కూడా పేర్కొన్నారు. అయితే ఇతర సంస్థలూ విధానాన్ని అనుసరించాలని తాను సిఫార్సు చేయనని స్పష్టం చేశారు.

## రూ .1,260 కోట్లకు బంగ్లాను అమ్మేసిన మీడియా అధినేత



మీడియా రంగ దిగ్గజం, ఎస్సెల్ గ్రూప్ చైర్మన్ సుభాష్ చంద్ర ఢిల్లీలోని ప్రతిష్టాత్మక లుటియన్స్ బంగ్లా జోన్లో ఉన్న తన విలాసవంతమైన బంగ్లాను రూ.1,260 కోట్లకు విక్రయించినట్లు సమాచారం. ఈ లావాదేవీ ఇటీవల కాలంలో దేశంలో జరిగిన అత్యంత విలువైన నివాస ఆస్తి ఒప్పందాల్లో ఒకటిగా నిలిచింది. భగవాన్ దాస్ రోడ్‌లో కన్నాట్ ప్లేస్, ఇండియా గేట్ సమీపంలో ఉన్న దాదాపు మూడు ఎకరాల విస్తీర్ణంలోని ఈ ఆస్తిని ఢిల్లీకి చెందిన ఒక ప్రముఖ వ్యాపార కుటుంబం కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అయితే కొనుగోలుదారుడి వివరాలను ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. డీల్‌కు సంబంధించిన తుది ప్రక్రియలు ఈ ఏడాది డిసెంబర్ నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని వర్గాలు తెలిపాయి.ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, సుభాష్ చంద్ర ఈ బంగ్లాను 2015లో సుమారు రూ.304 కోట్లకు కొనుగోలు చేశారు. ఇప్పుడు రూ.1,260 కోట్లకు విక్రయించడం ద్వారా దాదాపు పదేళ్లలో ఆస్తి విలువ నాలుగు రెట్లకు పైగా పెరిగినట్లు స్పష్టమవుతోంది.లుటియన్స్ ఢిల్లీ దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక నివాస ప్రాంతాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. బ్రిటిష్ ఆర్కిటెక్ట్ ఎడ్విన్ లుటియన్స్ రూపకల్పన చేసిన ఈ ప్రాంతంలో సుమారు 3,000 బంగ్లాలు ఉన్నాయి. కేంద్ర మంత్రులు, సుప్రీం కోర్టు న్యాయమూర్తులు, విదేశీ దౌత్యవేత్తలు, అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలు నివసించే ఈ ప్రాంతంలో భూమి లభ్యత చాలా పరిమితంగా ఉండటంతో ఆస్తుల ధరలు ఎప్పటికప్పుడు కొత్త రికార్డులు సృష్టిస్తున్నాయి. కోవిడ్ అనంతరం ఢిల్లీ లుటియన్స్ జోన్‌లో, గురుగ్రామ్ గోల్ఫ్ కోర్స్ రోడ్ పరిసరాల్లో భారీ విలువ కలిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందాలు పెరిగాయి. ఇటీవలే భగవాన్ దాస్ రోడ్‌లోని మరో 3.2 ఎకరాల రాజభవనం సుమారు రూ.1,000 కోట్లకు విక్రయమయ్యే దశకు చేరడం, అలాగే లుటియన్స్ ప్రాంతంలోని ఇతర చారిత్రక బంగ్లాలు కూడా వెయ్యి కోట్లకు పైగా ధరలు పలకడం ఈ మార్కెట్‌లో డిమాండ్ ఎంత బలంగా ఉందో చూపిస్తోంది.

# దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL

## జపాన్ సంచలన నిర్ణయం.. 80 ఏళ్ల శాంతివాదానికి స్వస్తి?

**రెండో ప్రపంచ యుద్ధం తర్వాత శాంతివాద విధానాలను అనుసరించిన జపాన్ ఇప్పుడు రక్షణ రంగంలో భారీ మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న భద్రతా సవాళ్లు, చైనా సైనిక దూకుడు, ఉత్తర కొరియా క్షిపణి పరీక్షల నేపథ్యంలో రక్షణ సామర్థ్యాల పెంపు అత్యవసరమని జపాన్ రక్షణ మంత్రి షింజిరో కోయిజుమి స్పష్టం చేశారు. యుద్ధాన్ని నివారించాలంటే ముందుగా దానిని అడ్డుకునే శక్తి ఉండాలని ఆయన పేర్కొనడం అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ప్రస్తుతం జపాన్ చేపడుతున్న చర్యలు ఆసియా భద్రతా సమీకరణాల్లో కీలక మార్పులకు సంకేతాలుగా కనిపిస్తున్నాయి. ఒకప్పుడు యుద్ధాన్ని పూర్తిగా తిరస్కరించిన దేశం ఇప్పుడు ఎందుకు సైనిక శక్తిని పెంచుకోవాల్సిన అవసరం వచ్చిందనే ప్రశ్నకు ఈ వ్యాఖ్యలే సమాధానంగా కనిపిస్తున్నాయి.**

ఒకప్పుడు యుద్ధాన్ని పూర్తిగా త్యజించి శాంతివాద దేశంగా ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన జపాన్.. ఇప్పుడు రక్షణ రంగంలో భారీ మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇండోపసిఫిక్ ప్రాంతంలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, చైనా సైనిక విస్తరణ, ఉత్తర కొరియా క్షిపణి పరీక్షలు, రష్యాఉక్రెయిన్ యుద్ధం వంటి పరిణామాల నేపథ్యంలో దేశ భద్రతకు కొత్త వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఈ నేపథ్యంలో జపాన్ రక్షణ మంత్రి షింజిరో కోయిజుమి కీలక వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆయన.. యుద్ధాన్ని నివారించాలంటే ముందుగా దానిని అడ్డుకునే శక్తి ఉండాలి. శాంతిని కాపాడుకోవాలంటే ప్రత్యర్థి దాడి చేయాలనే ఆలోచనకే భయపడేంత శక్తి మన దగ్గర ఉండాలి. అందుకే జపాన్ తన రక్షణ రంగంలో భారీ మార్పులు తీసుకువస్తోందని ఆయన స్పష్టం చేశారు. దీంతో, ఆ వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



### జపాన్‌లో ఈ మార్పుకు కారణం?

ప్రస్తుతం ఇండోపసిఫిక్ ప్రాంతం ప్రపంచ రాజకీయాల్లో అత్యంత సున్నితమైన ప్రాంతంగా మారింది. ముఖ్యంగా చైనా సైనిక శక్తి పెరుగుదల జపాన్‌ను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. గత పదేళ్లలో చైనా తన నౌకాదళం, వైమానిక దళం, క్షిపణి వ్యవస్థలను విస్తృతంగా అభివృద్ధి చేసింది. తైవాన్ చుట్టూ తరచూ నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలు, తూర్పు చైనా సముద్రంలో జపాన్ నియంత్రణలో ఉన్న సేన్‌కాకు దీవుల సమీపంలో చైనా నౌకల సంచారం, దక్షిణ చైనా సముద్రంలో బీజింగ్ దూకుడు టోక్యోలో భద్రతా ఆందోళనలను పెంచుతున్నాయి. జపాన్‌కు కేవలం చైనా మాత్రమే కాదు. ఉత్తర కొరియా కూడా మరో పెద్ద సవాల్‌గా మారింది. తరచూ నిర్వహిస్తున్న బాలిస్టిక్ క్షిపణి పరీక్షలు, అణ్వాయుధ కార్యక్రమాలు జపాన్ భద్రతకు నేరుగా ముప్పుగా భావిస్తున్నారు. ఉత్తర కొరియా ప్రయోగించిన కొన్ని క్షిపణులు జపాన్ గగనతలంపై నుంచి దూసుకెళ్లడం అక్కడ ప్రజల్లో ఆందోళన కలిగించింది. ఇక ఉక్రెయిన్‌పై రష్యా దాడి కూడా జపాన్ విధానంలో పెద్ద మార్పునకు కారణమైంది. శాంతి కోసం ఒప్పందాలు సరిపోవు.. అవసరమైతే శక్తి కూడా ఉండాలి అనే భావన జపాన్ విధాన నిర్ణేతల్లో బలపడింది.

### శాంతివాద దేశం నుంచి సైనిక శక్తి వైపు..

1945లో రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత జపాన్ రాజ్యాంగంలోని 9వ అధికరణం ప్రకారం యుద్ధాన్ని శాశ్వతంగా త్యజించింది. దాడి చేసే సైన్యాన్ని కాకుండా కేవలం రక్షణ కోసం మాత్రమే 'సెల్ఫ్ డిఫెన్స్ ఫోర్సెస్'ను ఏర్పాటు చేసింది. ఇలా దశాబ్దాల పాటు జపాన్ ప్రపంచానికి శాంతివాద దేశంగా నిలిచింది. కానీ ఇప్పుడు పరిస్థితులు మారిపోయాయి. ప్రపంచ భద్రతా సమీకరణాల్లో వచ్చిన మార్పులు జపాన్‌ను తన వ్యూహాన్ని పునఃపరిశీలించేలా చేశాయి. ఇటీవల జపాన్ ప్రభుత్వం రక్షణ వ్యయాన్ని భారీగా పెంచే నిర్ణయం తీసుకుంది. గతంలో జీడీపీలో కేవలం 1 శాతం మాత్రమే రక్షణకు కేటాయించగా, ఇప్పుడు దాన్ని 2 శాతానికి పెంచుతోంది. ఇది జపాన్ చరిత్రలోనే అతిపెద్ద రక్షణ విస్తరణగా భావిస్తున్నారు.

### జపాన్ ఏం చేస్తోంది ?

జపాన్ ప్రస్తుతం పలు కీలక రక్షణ కార్యక్రమాలను వేగవంతం చేస్తోంది. అమెరికా నుంచి అత్యాధునిక టోమాహాక్ క్షిపణుల కొనుగోలు. దీర్ఘశ్రేణి దాడి సామర్థ్యం కలిగిన క్షిపణుల అభివృద్ధి. సైబర్ యుద్ధ సామర్థ్యాల పెంపు. కృత్రిమ మేధ (AI) ఆధారిత రక్షణ వ్యవస్థలు, డ్రోన్ టెక్నాలజీ విస్తరణ. అంతరిక్ష భద్రతా వ్యవస్థల బలోపేతం. బ్రిటన్, ఇటలీలతో కలిసి ఆరో తరం యుద్ధ విమానాల అభివృద్ధి. ఇవన్నీ కేవలం రక్షణ కోసమేనని జపాన్ చెబుతున్నప్పటికీ, ఆసియా భద్రతా సమీకరణాల్లో ఇవి కీలక ప్రభావం చూపే అవకాశం ఉంది.

### చైనా స్పందన ఏంటి?

జపాన్ చర్యలను చైనా తీవ్రంగా విమర్శిస్తోంది. జపాన్ మళ్లీ సైనికవాదం వైపు వెళ్తోందని బీజింగ్ ఆరోపిస్తోంది. అయితే, కోయిజుమి ఈ విమర్శలను ఖండించారు. అణ్వాయుధాలు లేని, ఇతర దేశాలపై దాడి చేసే విధానం లేని జపాన్‌ను సైనికవాద దేశంగా చిత్రీకరించడం సరైంది కాదన్నారు. నిజానికి ప్రాంతీయ అస్థిరతకు కారణం చైనా సైనిక విస్తరణేనని ఆయన పరోక్షంగా వ్యాఖ్యానించారు.

### జపాన్ పంపుతున్న సందేశం..

జపాన్ తాజా వ్యూహం వెనుక ఒకే సందేశం ఉంది. శాంతి కోసం బలం అవసరం అని స్పష్టం చేస్తోంది. ఒకప్పుడు యుద్ధం వల్ల తీవ్రంగా నష్టపోయిన దేశం ఇప్పుడు యుద్ధాన్ని నివారించేందుకు సైనిక శక్తిని పెంచుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని జపాన్ చెబుతోంది. చైనా, ఉత్తర కొరియా, రష్యా వంటి భద్రతా సవాళ్ల మధ్య జపాన్ తీసుకుంటున్న ఈ నిర్ణయాలు ఆసియా భవిష్యత్తు భద్రతా సమీకరణాలను ప్రభావితం చేసే అవకాశముంది. అయితే, జపాన్ ప్రస్తుతం చేపడుతున్న రక్షణ విస్తరణ కేవలం ఆయుధాల కొనుగోలు కాదు. ఇది రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన శాంతివాద విధానానికి అతిపెద్ద మలుపు. రాబోయే దశాబ్దంలో జపాన్ ఆసియాలో మరింత ప్రభావవంతమైన సైనిక, వ్యూహాత్మక శక్తిగా ఎదిగే అవకాశాలు కనిపిస్తున్నాయని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

### అమెరికా పాత్ర ఎంత కీలకం?

జపాన్ భద్రతలో అమెరికా ప్రధాన భాగస్వామి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఏర్పడిన భద్రతా ఒప్పందం ప్రకారం జపాన్‌పై దాడి జరిగితే అమెరికా రక్షణకు రావాల్సి ఉంటుంది. జపాన్‌లో దాదాపు 50 వేల మంది అమెరికా సైనికులు మోహరించి ఉన్నారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో చైనాను సమతుల్యం చేయడంలో అమెరికాజపాన్ భాగస్వామ్యం కీలకంగా మారింది. అందుకే జపాన్ రక్షణ సామర్థ్యాల పెంపు కేవలం టోక్యో నిర్ణయం మాత్రమే కాదు.. అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలకు కూడా అనుగుణంగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## భారతీయుడి ప్రాణాలు తీసిన గుర్రపు బగ్గీ



**న్యూయార్క్:** భారత్ నుంచి మొదటిసారిగా అమెరికా పర్యటనకు వెళ్లిన ఒక కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. న్యూయార్క్ నగరంలోని ప్రసిద్ధ సెంట్రల్ పార్క్‌లో బుధవారం మధ్యాహ్నం జరిగిన గుర్రపు బగ్గీ ప్రమాదంలో 18 ఏళ్ల భారతీయ యువకుడు రోమంచ్ మహాజన్ దుర్మరణం పాలయ్యాడు. డ్రైవర్ అజాగ్రత్త, అదుపుతప్పిన గుర్రం కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

### ఫొటో కోసం ఆగిన వేళ.. ఊహించని ప్రమాదం

న్యూయార్క్ టైమ్స్ నివేదిక ప్రకారం.. దీపక్ మహాజన్ తన భార్య ప్రియ, కుమారుడు రోమంచ్, కుటుంబంలోని మరో సభ్యుడితో కలిసి సెంట్రల్ పార్క్‌లో గుర్రపు బగ్గీ షికారుకు వెళ్లారు. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో, వారి కుటుంబీకులకు ఒక ఫొటో తీసేందుకు బగ్గీ డ్రైవర్ కిందికి దిగాడు. నిబంధనల ప్రకారం డ్రైవర్ అలా దిగకూడదు. అదే సమయంలో ఆ గుర్రం అకస్మాత్తుగా బెదిరి, డ్రైవర్ నియంత్రణలో లేకపోవడంతో వేగంగా పరుగెత్తడం ప్రారంభించింది. బగ్గీ అదుపుతప్పి వేగంగా దూసుకుపోవడంతో లోపల ఉన్న కుటుంబ సభ్యులు ప్రాణభయంతో కేకలు వేశారు.

### తల్లిని రక్షించే క్రమంలో అనంత లోకాలకు

గుర్రం వేగంగా పరుగెడుతున్న క్రమంలో బగ్గీ మరో వాహనాన్ని ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో రోమంచ్ తల్లి ప్రియ మొదట బగ్గీ నుంచి కిందపడిపోయారు. ఆమెను కాపాడే ప్రయత్నంలో 18 ఏళ్ల రోమంచ్ కూడా వేగంగా వెళ్తున్న బగ్గీ నుంచి కిందికి దూకాడు. దురదృష్టవశాత్తూ అతను కింద పడేటప్పుడు తల భూమికి బలంగా తగలడంతో తీవ్ర గాయాలపాలై స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించినప్పటికీ, చికిత్స పొందుతూ రోమంచ్ మృతి చెందాడు. మిగిలిన ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ హృదయవిదారక సంఘటనకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

### నిషేధానికి పెరుగుతున్న డిమాండ్

ఈ ఘోర ప్రమాదం న్యూయార్క్ నగరంలో గుర్రపు బగ్గీల భద్రతపై పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. న్యూయార్క్ స్టేట్ సెనేటర్ ఎరిక్ బాట్చర్ బాధిత కుటుంబానికి సంతాపం ప్రకటిస్తూ, ప్రపంచంలోనే అత్యంత రద్దీగా ఉండే నగరాల్లో ఇలాంటి గుర్రపు బగ్గీలు ఉండటం సురక్షితం కాదని అన్నారు. ఈ సంస్కృతిని ముగించేందుకు తక్షణమే 'రైడర్స్ లా' బిల్లును ఆమోదించి, నగరంలో గుర్రపు బగ్గీలను పూర్తిగా నిషేధించాలని ఆయన న్యూయార్క్ సిటీ కౌన్సిల్‌ను డిమాండ్ చేశారు.

## అమెరికా-ఇరాన్ యుద్ధం: ప్రపంచాన్ని కుదిపేసిన మహా నష్టం

**వాషింగ్టన్:** గత కొన్ని నెలలుగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసిన అమెరికాఇరాన్ యుద్ధం ఎట్టకేలకు ముగిసింది. జూన్ 17న ఇరు దేశాలు 14 పాయింట్ల చారిత్రాత్మక శాంతి ఒప్పందం పై సంతకాలు చేయడంతో యుద్ధ మేఘాలు విడిపోయాయి. ఫిబ్రవరి 28న ప్రారంభమైన ఈ భీకర పోరు ప్రపంచవ్యాప్తంగా వేలాది మంది ప్రాణాలను బలితీసుకోవడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లను కుదిపేసింది. ఈ యుద్ధం వల్ల అమెరికాతో పాటు ప్రపంచ దేశాలు ఎంతటి భారీ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వచ్చిందో అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

**ప్రాణ నష్టం ఇలా..**

ఈ 108 రోజులకు పైగా సాగిన యుద్ధంలో అమెరికాకు చెందిన 13 మంది సైనికులు ప్రాణాలు కోల్పోగా, ఇరాన్ అధికారిక మీడియా ప్రకారం 3,300 మందికి పైగా ఇరానియన్లు మరణించారు. అలాగే లెబనాన్‌లో 3,826 మంది, ఇజ్రాయెల్‌లో దాదాపు 60 మంది ఈ హింసకు బలయ్యారు. కాగా తాజా ఒప్పందం ప్రకారం ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' జలసంధిని తక్షణమే తిరిగి తెరుస్తున్నారు. ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాలను తయారు చేయకూడదనే నిబంధనతో పాటు, ఆ దేశ పునర్నిర్మాణం కోసం 300 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 25 లక్షల కోట్లు) భారీ ఆర్థిక ప్యాకేజీని అందించడానికి అమెరికా అంగీకరించింది.

**అమెరికాపై భారీ ఆర్థిక భారం**

మూడీస్ అనలిటిక్స్ నివేదిక ప్రకారం, ఈ యుద్ధం కారణంగా అమెరికా వినియోగదారులు, పన్ను చెల్లింపుదారులు ఇప్పటివరకు సుమారు 132 బిలియన్ డాలర్ల (దాదాపు రూ. 11 లక్షల కోట్లు) మేరకు నష్టపోయారు. పెంటగాన్ గణాంకాల ప్రకారం కేవలం సైనిక చర్యలకే 29 బిలియన్ డాలర్లు ఖర్చయ్యాయి. యుద్ధం ప్రారంభంలో గ్యాలన్ గ్యాస్ ధర 3 డాలర్ల లోపు ఉండగా, హోర్ముజ్ జలసంధి దిగ్బంధనంతో అది ఏకంగా 4.56 డాలర్లకు చేరింది. దీనివల్ల అమెరికన్లు ప్రతిరోజూ చమురు కోసం వందల మిలియన్ల డాలర్లు అదనంగా వెచ్చించాల్సి వచ్చింది. డీజిల్ ధరలు కూడా గ్యాలన్‌కు 5.69 డాలర్ల రికార్డు స్థాయికి చేరడంతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకాయి.

# మూవీ లాంఛ్ ఓకే.. మీకు ఇదేం పని సార్..!



వెంకీమామ అనిల్ రావిపూడి కాంబోలో మరో చిత్రం రానుంది. ఇప్పటికే ఈ విషయాన్ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ మూవీ కల్యాణ్ రామ్ కూడా నటిస్తున్నారు. ఈ చిత్రంలో కృతిశెట్టి, కీర్తి సురేశ్‌ను హీరోయిన్లుగా కనిపించనున్నారు. ఈ రోజే అధికారికంగా షూటింగ్ ప్రారంభమైంది. ఈ మూవీ షూటింగ్ లాంఛ్ చేయడానికి నిర్మాత అల్లు అరవింద్, దర్శకుడు రాఘవేంద్రరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముహూర్తపు షాట్‌కు అల్లు అరవింద్ క్లాప్ కొట్టారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ ఫస్ట్ షాట్‌కి డైరెక్షన్ చేసిన రాఘవేంద్రరావు వ్యవహరించిన తీరు సోషల్ మీడియాలో ట్రోల్స్‌కు కారణమైంది. హీరోయిన్ కృతి శెట్టి భుజంపై తన చేయి పెట్టి మరి మాట్లాడుతూ కనిపించారు. దర్శకత్వం వరకు ఓకే కానీ.. యంగ్ హీరోయిన్ భుజంపై చేతులు వేయాల్సిన అవసరం ఏముందని నెటిజన్స్ ప్రశ్నిస్తున్నారు. దీంతో హీరోయిన్‌తో ఆయన వ్యవహరించిన తీరుపై నెట్టింట విమర్శలొస్తున్నాయి. ఏదేమైనా టాలీవుడ్ పేరున్న డైరెక్టర్ ఇలా వ్యవహరించడం సరికాదని సోషల్ మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు.



# నా డ్యాన్స్ నాకే నచ్చలేదు!

ఎంత బాగా పని చేసినా ఇంకా బెటర్‌గా చేసి ఉంటే బాగుండేది అనిపిస్తే కచ్చితంగా వాళ్లకి పని పట్ల శ్రద్ధ ఎక్కువ అని అర్థం. తమన్నా ఈ కోవకే చెందుతారు. అందుకు ఆమె తాజా మాటలు ఓ నిదర్శనం. బాలీవుడ్ కొరియోగ్రాఫర్, డైరెక్టర్ ఫరా ఖాన్ తన యూ ట్యూబ్ వ్లాగ్‌లో భాగంగా తమన్నా ఇంటికి వెళ్లారు. అప్పుడు ఈ ఇద్దరూ చాలాసేపు మాట్లాడుకున్నారు. ఆ ముచ్చట్లలో 'జైలర్'లోని 'నువ్వు కావాలయ్యా... పాట గురించి తమన్నా ప్రస్తావించారు. ''ఈ పాటలో నేను చేసిన డ్యాన్స్ నా మనసుకి నచ్చలేదు. ఈ పాట షూట్ పూర్తయి, లొకేషన్ నుంచి వెళుతున్నప్పుడు నాకు అసంతృప్తిగా అనిపించేది. ఇంకా బెటర్‌గా చేసి ఉంటే బాగుండేది అనే ఫీలింగ్ కలిగేది'' అని ఫరాతో తమన్నా అన్నారు. ఈ మాటలు విన్నవాళ్లు ఆశ్చర్య పోవడం ఖాయం. ఎందుకంటే ఈ స్పెషల్ సాంగ్‌లో తమన్నా డ్యాన్స్‌కి అద్భుతమైన ప్రశంసలు లభించాయి. ఈ పాటలో తమన్నా చేసిన హుక్ స్టెప్‌ని అనుకరించి, చాలామంది రీల్స్ కూడా చేశారు. కానీ ఈ మిల్కీ బ్యూటీకి మాత్రం తన స్టెప్స్ నచ్చలేదు. తమన్నా ఇలా అనగానే... ''నిజానికి నువ్వు ఏ పని చేసినా ఇంకా బాగా చేయాల్సింది అని ఆలోచిస్తావు'' అన్నారు ఫరా ఖాన్. అంటే... తమన్నా అంత ప్రొఫెషనల్‌గా ఉంటారని అర్థం. ఇక 'నువ్వు కావాలయ్యా.. పాట తర్వాత తమన్నాకి బోలెడన్ని స్పెషల్ సాంగ్స్‌కి చాన్స్ వచ్చింది. అలా వచ్చిన వాటిలో ఆమె చేసిన 'ఆజ్ కీ రాత్' సాంగ్ కూడా బాగా హిట్టయింది. హిందీ చిత్రం 'స్త్రీ 2'లోని పాట ఇది. ''ఈ పాట కోసం నేను 15 రోజులు శిక్షణ తీసుకుని, ఆ తర్వాత షూట్‌కి వెళ్లాను. ఎందుకంటే నేను ట్రైన్డ్ డ్యాన్సర్‌ని కాదు'' అని పేర్కొన్నారు తమన్నా.

### దురంధర్ స్క్రిప్ట్ అక్కడి నుంచే..

# రాకేశ్ బేడీ స్ట్రాంగ్ కౌంటర్..!



రణ్‌వీర్ సింగ్ హీరోగా వచ్చిన స్పై యాక్షన్ థ్రిల్లర్ దురంధర్. గతేడాది డిసెంబర్‌లో రిలీజైన ఈ సినిమా బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. పాకిస్తాన్ నేపథ్యంలో వచ్చిన ఈ మూవీకి ఆడియన్స్ నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. పార్ట్ 1 బ్లాక్‌బస్టర్ కావడంతో మేకర్స్ మూడు నెలల గ్యాప్‌లోనే సీక్వెల్ కూడా రిలీజ్ చేశారు. ఈ రెండు పార్టులు కలిసి బాక్సాఫీస్ వద్ద రూ.3 వేల కోట్ల మార్క్ దాటేశాయి. ఈ వసూళ్లతో ఇండియన్ సినిమా చరిత్రలోనే సరికొత్త రికార్డ్ సృష్టించాయి. అయితే ఈ మూవీపై మొదటి నుంచే విమర్శలు వస్తూనే ఉన్నాయి. ఇదొక ప్రాపగండ ఫిల్మ్ అనే ముద్ర వేశారు. అయినప్పటికీ వసూళ్ల పరంగా ఎలాంటి డ్యామేజ్ జరగలేదు. అంతేకాకుండా పార్ట్ 1 రిలీజ్ తర్వాత ప్రాపగండ ముద్రవేసిన కొందరు.. ఈ మూవీకి స్క్రిప్ట్ పీఎంవో ఆఫీస్ నుంచి వచ్చిందని విమర్శించారు. ఈ వ్యాఖ్యలపై తాజాగా దురంధర్ నటుడు రాకేశ్ బేడీ స్పందించారు. అలాంటిదేం లేదని ఆయన ఖండించారు. దిల్లీలో జరిగిన అమృత్ రత్న 2026 సదస్సులో పాల్గొన్న రాకేశ్ బేడీ విమర్శించేవారికి తనదైన శైలిలో సమాధానమిచ్చారు. రాకేశ్ బేడీ మాట్లాడుతూ..'ఈ సినిమా హిట్టయ్యాక ధురందర్ స్క్రిప్ట్ నేరుగా ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ) నుంచి రాశారని కొందరు అన్నారు. అలాంటి స్టోరీ రాయగల వ్యక్తి పీఎంఓలో ఎవరున్నారో చెప్పండని నేను అడిగా. అలాంటి ఆలోచన కూడా ఎవరికీ రాదు. ఈ సినిమాలో నేను చెప్పిన డైలాగులు ఎవరైనా రాయగలరా? అసలు అక్కడ ఉన్నవాళ్లు ఇలాంటి డైలాగుల గురించి ఆలోచన చేయగలరా? అని వాళ్లను ప్రశ్నించా' అని తెలిపారు. కాగా.. ఈ స్పై యాక్షన్ మూవీలో రాకేశ్ బేడీ కీలక పాత్రలో మెప్పించారు. జమీల్ జమాలీగా పాకిస్థాన్ రాజకీయ నాయకుడి పాత్రలో అదరగొట్టేశారు. ఈ చిత్రాలకు ఆదిత్య ధర్ దర్శకత్వం వహించారు. ఈ మూవీలో సారా అర్జున్ హీరోయిన్‌గా కనిపించింది. ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, ఆర్. మాధవన్, గౌరవ్ గెరా, ష్ పాండోర్ కీలక పాత్రల్లో నటించారు.

# రుక్మిణి వసంత్ నవ్వితే కుర్రాళ్లు ఫిదా అవ్వాల్సిందే..



రుక్మిణి వసంత్.. కన్నడ ఇండస్ట్రీ నుంచి వచ్చింది ఈ ముద్దుగుమ్మ.బీర్బల్ ట్రైలాజీ కేసు 1: ఫైండింగ్ వజ్రముని అనే సినిమాతో అరంగేట్రం చేసింది. ఆతర్వాత ఆమె నటించిన సప్త సాగరాలు దాటి: సైడ్ ఏ సినిమా మంచి విజయాన్ని అందుకుంది. ఈ సినిమా తెలుగులోనూ డబ్ అయ్యి మంచి హిట్ అయ్యింది. దాంతో రుక్మిణి వసంత్ మంచి గుర్తింపుతో పాటు క్రేజ్ సొంతం చేసుకుంది. తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలే నిఖిల్ హీరోగా నటించిన అప్పుడో ఇప్పుడో ఎప్పుడో అనే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది.కానీ ఈ సినిమా ఎప్పుడొచ్చిందో.. ఎప్పుడు పోయిందో కూడా ప్రేక్షకులకు తెలియదు. ఆతర్వాత తెలుగులో సినిమా చేయలేదు.కన్నడలో వరుసగా సినిమాలు చేసి మెప్పించింది రుక్మిణి. కాంతార 1 సినిమాలో నటించి భారీ హిట్ అందుకుంది ఈ ముద్దుగుమ్మ.ప్రస్తుతం ఎన్టీఆర్ నటిస్తున్న డ్రాగన్ సినిమాలో నటిస్తుంది. ఇటీవలే ఈ సినిమా నుంచి టీజర్ విడుదలై ఆకట్టుకుంది.

### రజనీ Vs మాజీ అల్లుడు..

# ఆసక్తికర పోరు



రజనీకాంత్ హీరోగా నటిస్తున్న జైలర్2 చిత్రం షూటింగ్ దాదాపు పూర్తయింది. ఈ ఏడాది దీపావళికి విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నారు. ఇక మరోవైపు రజనీ మాజీ అల్లుడు ధనుష్ తన 55వ చిత్రాన్ని కూడా దీపావళి టార్గెట్ రెడీ చేస్తున్నట్టు తెలుస్తోంది. ఒకవేళ అదే కనుక జరిగితే.. కోలీవుడ్ బాక్సాఫీస్ బరిలో రసవత్తర పోరు జరిగే అవకాశం ఉంది. అంటే ఒకప్పుడు మామఅల్లుళ్లు.. ఇప్పుడు బాక్సాఫీస్ బరిలో తలపడబోతున్నారన్నమాట. నిజానికి జైలర్2 సినిమా ఈపాటికే రిలీజ్ అవ్వాల్సింది. అయితే రీషూట్స్ కారణంగా సినిమా పలుమార్లు డిలే అవుతూ వచ్చింది. ఇక అలా వాయిదాలు పడుతూ ఆకరికి దీపావళి బరిలో విడుదలకు రెడీ అవుతోంది. అయితే అటు ధనుష్ మాత్రం తన సినిమా ప్రారంభం నుంచి అక్టోబర్ నెల రిలీజ్ టార్గెట్‌గానే తన సినిమాను రెడీ చేస్తున్నాడు. ఈ విషయంలో ప్రాక్టికల్‌గా చూసుకుంటే సూపర్‌స్టార్ రజనీకాంత్ స్టార్ డమ్‌తో ధనుష్ పోటీ పడే అవకాశం లేదు. కానీ వీళ్ల మధ్య ఉన్న పాత బంధం కారణంగా ఈ బాక్సాఫీస్ క్లాష్ అందర్నీ ఆకర్షించే అవకాశం ఉంది. అయితే రజనీకాంత్ సినిమా రంగంలో ఉన్నప్పుడు ధనుష్ తన సినిమాని థియేటర్లలోకి తెచ్చేంత సాహసం చేయడంటున్నారు మరికొంతమంది. ధనుష్ సినిమాలన్నీ కూ పాన్ ఇండియా లెవెల్లో రిలీజ్ అవుతాయి. దాంతో బరిలో రజనీకాంత్ ఉన్నా ధనుష్ తగ్గకపోవచ్చని అంటున్నారు మరికొంతమంది. చూడాలి ఈ ఆసక్తికర పోరులో చివరికి ఏమౌతుందో. రజనీకాంత్ పెద్ద కుమార్తె ఐశ్వర్యను ధనుష్ 2004లో వివాహం చేసుకున్నారు. కానీ వ్యక్తిగత కారణాలతో వారి 18 ఏళ్ల వైవాహిక బంధాన్ని విడిచి 2022లో విడిపోతున్నట్టు ప్రకటించారు. అనంతరం 2024లో కోర్టు వీళ్లకు అధికారికంగా విడాకులు మంజూరు చేసింది.



# బ్యాడ్ లక్ బ్యూటీ అందాల జాతర..

### అవకాశాల కోసమే అమ్మడి ఎదురుచూపులు..

చిత్ర పరిశ్రమలో రాణించాలంటే కేవలం అందం, అభినయం ఉంటేనే సరిపోదు, వీటికి తోడు కొద్దిగా అదృష్టం కూడా కలిసి రావాలి. టాలీవుడ్‌లో గ్లామర్ పరంగా సెన్సేషన్ సృష్టించింది. కానీ సరైన సక్సెస్ లేక వెనుకబడిన ముద్దుగుమ్మలలో కేతిక శర్మ ఒకరు. పూరి జగన్నాథ్ నిర్మించిన 'రొమాంటిక్' సినిమాతో టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది ఈ అమ్మడు.తొలి చిత్రంలోనే తన హాట్ లుక్స్‌తో, రొమాంటిక్ సీన్స్‌తో కుర్రకారు గుండెల్లో మంటలు రేపింది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోయింది.ఆ తర్వాత నాగశౌర్య సరసన 'లక్ష్య' సినిమాలో నటించినా ఈమెకు నిరాశే ఎదురైంది. అయినప్పటికీ కేతికకు అవకాశాలు మాత్రం తగ్గలేదు. తెలుగులో వరుస ఆఫర్స్ వచ్చాయి. మెగా హీరో వైష్ణవ్ తేజ్ సరసన 'రంగ రంగ వైభవంగా', అలాగే పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ కాంబినేషన్‌లో వచ్చిన 'బ్రో' సినిమాలోనూ కీలక పాత్ర పోషించింది.ఈ భారీ చిత్రాలు కూడా ఆమెకు బ్రేక్ ఇవ్వలేకపోయాయి. ప్రస్తుతం కొత్త సినిమాలు ఏవీ అనౌన్స్ చేయని కేతిక శర్మ, సోషల్ మీడియా వేదికగా అభిమానులను పలకరిస్తోంది.నిరంతరం సరికొత్త, స్టన్నింగ్ ఫోటోషూట్లను షేర్ చేస్తూ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. తాజాగా ఈ భామ పోస్ట్ చేసిన కొన్ని గ్లామరస్ ఫోటోలు వైరల్ అవుతున్నాయి.ఈ ఫోటోలలో కేతిక తన పర్ఫెక్ట్ ఫిగర్ , బోల్డ్ లుక్స్‌తో ఇంటర్నెట్‌లో హీట్ పెంచేస్తోంది. ఈ ఫోటోలపై నెటిజన్లు "బ్యూటీ క్వీన్", "స్టన్నింగ్ కేతిక" అంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

# అనవసరంగా అతనితో ఎఫైర్ పెట్టుకున్నా..



ఇండస్ట్రీలో ఈ అమ్మడు ఓ హాట్ బ్యూటీ. ఈ ముద్దుగుమ్మ అందానికి ఫిదా కానీ కుర్రాడు ఉండడు. హీరోయిన్ గా రాణిస్తూనే స్పెషల్ సాంగ్స్ లో మెప్పించింది. అయితే హీరోయిన్ గా కంటే స్పెషల్ సాంగ్స్ తోనే ఎక్కువ పాపులర్ అయ్యింది. అలాగే ఫ్యాన్ బేస్ కూడా గట్టిగానే క్రియేట్ చేసుకుంది ఈ ముద్దుగుమ్మ. కెరీర్ బిగినింగ్ లో ఈ చిన్నది పలు యాడ్స్ చేసి ప్రేక్షకులను మెప్పించింది. ఆతర్వాత స్టార్ అయ్యింది. తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళం సినిమాల్లో నటించి ఆకట్టుకుంది. ఈ బ్యూటీ ఇప్పుడు ఎక్కువగా గ్లామర్ పాత్రలకే పరిమితం అయ్యింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? చాలా మంది స్టార్ హీరోలతో నటించింది అంతే కాదు ఓ స్టార్ క్రికెటర్ తో రిలేషన్ షిప్ కూడా నడిపింది. గతంలో ఆ స్టార్ క్రికెటర్ గురించి షాకింగ్ కామెంట్స్ చేసి వార్తల్లో కూడా నిలిచింది ఆమె.. ఆమె మరోవరో కాదు.. హాట్ బ్యూటీ రాయ్ లక్ష్మీ.. 2005లో తమిళ చిత్రం కర్క కసదరతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది ఈ అందాల తార. అదే ఏడాది కన్నడ చిత్రం వాల్మీకిలో శివ రాజ్‌కుమార్ సరసన నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగులో కంచనమాల కేబుల్ టీవీ, నీలి మేఘం, బలుపు వంటి చిత్రాలలో నటించింది. ఆతర్వాత స్టార్ హీరోల సినిమాల్లో స్పెషల్ సాంగ్స్ చేసింది. పవన్ కళ్యాణ్, చిరంజీవి, బాలకృష్ణలాంటి స్టార్ హీరోలతో స్టెప్పులేసింది. ప్రస్తుతం ఈ బ్యూటీ సినిమాల స్పీడ్ తగ్గించింది. కాగా గతంలో ఓ ఇంటర్వ్యూలో ఈ అమ్మడు సెన్సేషనల్ కామెంట్స్ చేసింది. స్టార్ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోనితో తనకు గతంలో ఉన్న రిలేషన్‌షిప్ గురించి షాకింగ్ వ్యాఖ్యలు చేసింది. ఆ కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. రాయ్ లక్ష్మీ ధోనితో తన సంబంధాన్ని “ఒక మచ్చ” గా అభివర్ణించింది. భవిష్యత్తులో తన పిల్లలు ఈ విషయం గురించి ప్రశ్నిస్తే తాను ఎలా సమాధానం చెప్పాలో తెలియడం లేదని.. అలాగే గతంలో ధోనితో తనకు సంబంధం ఉందని వచ్చిన వార్తలను తాజాగా తవ్వి తీస్తున్నారని, ఇంటర్నెట్‌లో ఈ విషయాలు ఇప్పటికీ వైరల్ అవుతున్నాయని రాయ్ లక్ష్మీ అసహనం వ్యక్తం చేసింది. ఈ ప్రచారాన్ని దూరం పెట్టాలని కోరింది. ఈ కామెంట్స్ ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com